



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 291 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 27 జూన్ 2025 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE : 291 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 27 JUNE 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

## ఇజ్రాయెల్‌పై విజయం సాధించాం, అమెరికాను చిత్తు చేశాం



- ఇజ్రాయెల్‌పై ఇరాన్ విజయం సాధించిందని ఖమేనీ ప్రకటన
- 'మోసపూరిత జియోనిస్ట్ పాలన'ను చిత్తు చేశామని వ్యాఖ్య
- అమెరికా జోక్యం చేసుకున్నా ఫలితం శూన్యమన్న ఇరాన్

పెన్ పవర్ డెస్క్:ఇజ్రాయెల్‌పై ఇరాన్ 'విజయం' సాధించిందని, అమెరికాను కూడా చావుదెబ్బ తీశామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్‌ను నేరుగా ప్రస్తావిం చకుండా, "మోసపూరిత జియోనిస్ట్ పాలన" అంటూ సంబోధించారు.

వివరాలు 2లో..

## డ్రగ్స్ తీసుకున్న నటులను ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలి

- తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదామన్న దిల్ రాజు
- డ్రగ్స్ తీసుకున్న నటులను ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలని దిల్ రాజు ప్రతిపాదన
- యువత డ్రగ్స్‌కు అలవాటైతే దేశ భవిష్యత్తు అంధకారమేనన్న విజయ్ దేవరకొండ
- ప్రతి ఒక్కరూ సైనికుడిలా మారి డ్రగ్స్‌ను నిర్మూలించాలన్న రామ్ చరణ్



వివరాలు 2లో..

## కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లోపించింది

- ఏపీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణపై జగన్ ధ్వజం
- రాజ్యాంగ ఉల్లంఘనలంటూ ఆరోపణ
- ఖనిజ సంపద తాకట్టు, సంఘటిత నిధి ప్రైవేటుపరం అంటూ విమర్శలు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను గాలికొదిలేసి, రాజ్యాంగ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, నిధుల సమీకరణ పద్ధతులపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. 2025 జూన్ 25న ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) రెండో విడత నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీలు లేదా బాండ్లు) జారీని పూర్తి చేసిందని, 9.30 శాతం అధిక వడ్డీ (కూపన్) రేటుకు రూ. 5,526 కోట్లు సమీకరించిందని

వివరాలు 2లో..

### రాజమండ్రిలో 'అఖండ గోదావరి'

## పర్యాటక ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేసిన షెకావత్, పవన్ కల్యాణ్

- రాజమండ్రిలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు
- కేంద్రం రూ.375 కోట్లతో రాష్ట్రంలో చేపట్టనున్న పర్యాటక ప్రాజెక్టులు
- ప్రాజెక్టుల ఫోటో గ్యాలరీని తిలకించిన షెకావత్, పవన్
- గోదావరి రివర్ ఫ్రంట్ నుంచి ప్రాజెక్టు ప్రాంతం పరిశీలన
- హాజరైన రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు




పెన్ పవర్ డెస్క్:రాజమండ్రిలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు నిర్మాణానికి గురువారం అంకురార్పణ జరిగింది. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం గోదావరి తీర ప్రాంత అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం, కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తున్న రూ. 375 కోట్ల నిధులతో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన ఫోటో గ్యాలరీని గజేంద్ర సింగ్ షెకావత్, పవన్ కల్యాణ్ తిలకించారు. అనంతరం, గోదావరి తీరంలోని రివర్ ఫ్రంట్ వ్యూ పాయింట్ నుంచి

వివరాలు 2లో..

# డ్రగ్స్ పై యుద్ధం...

## ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం

- గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటిస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి
- గత ప్రభుత్వం గంజాయి కట్టడిలో విఫలమైందని విమర్శ
- 'ఈగల్' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా గంజాయిపై ప్రత్యేక నిఘా
- 26 జిల్లాల్లో నార్కోటిక్స్ సెల్స్, పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు
- మద్యం ఆదాయంలో 2 శాతం డ్రగ్స్ నిర్మూలనకు కేటాయింపు
- గంజాయి బ్యాచ్‌కు సహకరించిన వారికి గుణపాఠం తప్పదని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబా బు స్పష్టం చేశారు. వీటిపై యుద్ధం ప్రకటిస్తున్నామని, ఈ పోరాటంలో ఎవరు అడ్డువచ్చినా ఉపేక్షించేది లేదని, వారిని తొక్కుకుంటూ ముందుకెళతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో గంజాయి నియంత్రణ పూర్తిగా గాలికొదిలేశారని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడినందుకు టీడీపీ కార్యాలయంపై దాడులు చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యాంటీ నార్కోటిక్స్ డే సందర్భంగా గురువారం నాడు గుంటూరులో నిర్వహించిన వాకథాన్‌లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం శ్రీకన్వెన్షన్‌లో విద్యార్థులు, యువతతో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. "రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ముఠా కక్షలకు తావులేదు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అణచివేసింది తెలుగుదేశం పార్టీయే. మతసామర స్యాన్ని కాపాడతాం, విద్వేషాలు రెచ్చగొట్టేవారిని ఉపేక్షించం. గంజాయి బ్యాచ్‌కు అండగా నిలిచిన వారికి తగిన గుణపాఠం చెబుతాం" అని సీఎం ఉద్ఘాటించారు. గంజాయి నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు కూడా కలిసిరావాలని కోరారు. "ప్రజలను మెప్పించి ఓట్లు వేయించుకోవాలి కానీ, తప్పుడు పనులతో రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే కుదరదు. 2021లో దేశవ్యాప్తంగా పండిన మొత్తం గంజాయిలో 50 శాతం ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచే ఉత్పత్తి కావడం, దానికి విశాఖపట్నం కేంద్రంగా మారడం తీవ్ర ఆవేదన కలిగించింది" అని ఆయన అన్నారు. గంజాయికి బానిసలవడం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని, యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ

వివరాలు 2లో..

## సీఎం చంద్రబాబును కలిసిన కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్

- ఏపీలో కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పర్యటన
- రాజమండ్రిలో అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన
- అనంతరం ఉండవల్లి రాక... స్వాగతం పలికిన మంత్రి నారా లోకేశ్
- సీఎం చంద్రబాబుతో పలు అంశాలు చర్చించిన షెకావత్

వివరాలు 2లో..



### మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై కేసు..

## ఎంపీపీ అరెస్ట్.. వైసీపీ నేతలకు చిక్కులు!

- మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై బాణసంచా ఘటనలో కేసు
- 2024 ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి, వ్యక్తి కంటికి గాయం
- లోకేశ్ అనే వ్యక్తి కంటిచూపు కోల్పోయిన వైనం
- శ్రీకాంత్ రెడ్డితో పాటు 19 మంది వైసీపీ నేతలపై ఎఫ్ఐఆర్
- ఎంపీపీ సుదర్శన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో చర్యలు



పెన్ పవర్ డెస్క్:అన్నమయ్య జిల్లాలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డితో పాటు పలువురు ఆ పార్టీ నేతలపై కేసు నమోదైంది. 2024 ఎన్నికల ప్రచార సమయంలో బాణసంచా పేల్చడం వల్ల ఓ వ్యక్తి కంటిచూపు కోల్పోయిన ఘటనకు సంబంధించి ఈ కేసు నమోదు కాగా, ఓ నేతను పోలీసులు అదుపులోకి కూడా తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ కార్యకర్తలు లక్కిరెడ్డిపల్లి మండలం అగ్రహారంలో భారీగా బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో జరిగిన అపశ్రుతిలో లోకేశ్ అనే

వివరాలు 2లో..

### ఆరేళ్లుగా పోటీ చేయని రాజకీయ పార్టీలు...

## ఎన్నికల సంఘం కీలక నిర్ణయం!

- ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలపై ఎన్నికల సంఘం చర్యలు
- ఆరేళ్లుగా యాక్టివ్‌గా లేని 345 పార్టీల డీలిస్టింగ్ ప్రాసెస్ షురూ
- సంబంధిత పార్టీలకు కార్యాలయాలు కూడా లేవని గుర్తింపు
- దేశవ్యాప్తంగా 2,800కు పైగా గుర్తింపు లేని నమోదిత పార్టీలు
- వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలపై వేటు

పెన్ పవర్ డెస్క్:దేశంలో రాజకీయ పార్టీగా నమోదు చేసుకుని, ఆరేళ్లుగా ఎటువంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా నిష్క్రియంగా ఉన్న పార్టీలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) దృష్టి సారించింది. 2019 నుంచి ఇప్పటివరకు ఒక్క ఎన్నికలో కూడా పాల్గొనని 345

వివరాలు 2లో..




## క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ అభిప్రాయం తెలపండి

- రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఏర్పాటు
- స్కాన్ చేసి సరుకులు, డీలర్లపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వొచ్చు
- 65 ఏళ్లు పైబడినవారు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ సౌకర్యం
- ఈనెల 26 నుంచే జులై నెల సరుకుల పంపిణీ ప్రారంభం
- నూతన విధానాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహర్

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందిం చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరి యు వినియోగదా రుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల

వివరాలు 2లో..



## డాకింగ్ విజయవంతం...

### అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన శుభాంశు శుక్లా



- యాక్సియం-4 మిషన్ ద్వారా అంతరిక్షంలోకి భారత వ్యోమగామి
- శుభాంశు శుక్లా సహా నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌లో ప్రవేశం
- అమెరికా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ప్రయోగం
- గురువారం సాయంత్రం విజయవంతంగా స్పేస్‌క్రాఫ్ట్ డాకింగ్
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 14 రోజుల పాటు పరిశోధనలు

పెన్ పవర్ డెస్క్:అంతరిక్ష పరిశోధన రంగంలో భారత్ మరో కీలక విజయాన్ని అందుకుంది. యాక్సియం-4 మిషన్ లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు అంతర్జాతీయ వ్యోమగాములతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో

వివరాలు 2లో..

## భారత్‌పై చైనా ఎత్తుగడ! బీజింగ్ నుంచి ఆగిపోయిన స్పెషాలిటీ ఫెర్టిలైజర్స్ సరఫరా



- భారత్‌కు చైనా నుంచి ప్రత్యేక ఎరువుల సరఫరా రెండు నెలలుగా నిలిపివేత
- ఇతర దేశాలకు మాత్రం చైనా ఎగుమతులు యథాతథం
- పంటల దిగుబడి పెంచడంలో ఈ ఎరువులు చాలా ముఖ్యం
- అధికారిక నిషేధం లేకుండానే తనిఖీల పేరుతో చైనా ఎత్తుగడ
- భారత్ వాడే ప్రత్యేక ఎరువుల్లో 80 శాతం చైనా నుంచే దిగుమతి
- ప్రత్యామ్నాయాల కోసం పశ్చిమాసియా, ఐరోపా వైపు భారత్ చూపు

పెన్ పవర్ డెస్క్:గత రెండు నెలలుగా చైనా నుంచి భారత్‌కు ప్రత్యేక ఎరువుల (స్పెషాలిటీ ఫెర్టిలైజర్స్) ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. అయితే, బీజింగ్ ఇతర దేశాలకు మాత్రం ఈ ఎరువులను యథావిధిగా సరఫరా చేస్తుండటం గమనార్హం. పండ్లు, కూరగాయలు వంటి వాణిజ్య పంటలతో పాటు ఇతర పంటల్లో దిగుబడిని గణనీయంగా పెంచడంలో ఈ ప్రత్యేక ఎరువులు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ పరిణామం భారతీయ వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# క్రమ"శిక్ష"ణ ఎక్కడ?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రమంగా పార్టీపైన పట్టుబిగించే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ కు ఎవరూ శత్రువులుండరు. ఆ పార్టీ నేతలే. ఇది ఇప్పుడు మొదలయింది కాదు. దేశంలో ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా లేకపోయినా పైకి పార్టీ లేచే కొద్దీ కిందకు లాగే వాళ్లు ఎక్కువ మంది ఉంటారు. అందుకే చాలా మంది చాలా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు ప్రత్యర్థి పార్టీల నేతల కంటే సొంత పార్టీ నేతలకే ఎక్కువ భయపడుతుంటారు. అందుకు కారణం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది తమ కారణంగానే నని భావించి తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటారు. ఎమ్మెల్యే టిక్కెట్ రాకపోతే.. ఎమ్మెల్సీని అడుగుతారు. అదిఇస్తే మంత్రి పదవి సంగతేంటని ప్రశ్నిస్తారు.

**అన్నీ గాంధీ భవన్ నుంచి డిమాండ్లే...**

కుటుంబంలో ఒకరికి టిక్కెట్ ఇచ్చి మంత్రిపదవిని ఇచ్చినా మిగిలిన కుటుంబ సభ్యుల మాటేంటని నిలదీస్తారు. ఇక ఎప్పుడూ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయని వారు, వారి వల్ల ఒక్క ఓటు కూడా కాంగ్రెస్ గుర్తుపై వేయించలేని వారు సయితం తమకు పదవులకు కావాలని కోరతారు. కోరడమే కాదు గాంధీభవన్ లో కూర్చుని మరీ డిమాండ్ చేస్తారు. ఏకంగా మీడియా సమావేశం పెట్టి సొంత పార్టీ పైన, ప్రభుత్వంపైన విమర్శలు చేయడానికి కూడా వెనుకాడరు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ పాదయాత్రతో కాంగ్రెస్ సుదీర్ఘకాలం తర్వాత అధికారంలోకి వచ్చినా ఆ విజయం తమవల్లనేనంటూ డప్పాలుకొట్టుకున్న వారు అనేక మంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కూడా అసంతృప్తుల బెడద 2004 ముందు నుంచి ఆయన మరణించేంత వరకూ తప్పలేదు.

**పార్టీపై దృష్టిపెట్టాలనకుంటున్నా....**

ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండటంతో ఇప్పటి వరకూ పార్టీ విషయాలను పెద్దగా పట్టించుకోలేదు. ఆయన ఎక్కువగా పాలనపైనే ఫోకస్ పెట్టారు. మంత్రి వర్గ విస్తరణ కూడా పూర్తి కావడంతో పాటు స్థానికసంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ కాంగ్రెస్ పార్టీని గాడిలో పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. నియోజకవర్గ స్థాయి నేతలు కూడా మీసాలు మెలేస్తుండటం, సీనియర్ నేతలపైనా, మంత్రులపైనా విమర్శలు చేస్తుండటంతో రేవంత్ రెడ్డి పార్టీ అధినాయకత్వంతో మట్లాడి క్రమశిక్షణ కమిటిని నియమించుకున్నారు.క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ గా ఉన్న వారు సయితం తమ ఇలాకాలో సొంత పార్టీ నేతలను విమర్శలు చేయడం కొంత ఇబ్బందిగా మారింది. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న హెచ్చరికలు పెద్దగా పనిచేయడంలేదు.

**నాడు జగ్గయ్యపేటలో వైఎస్...**

కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీ అనేది ఒక బ్రహ్మపదార్థం. 1999లో ఒక ఇన్సిడెంట్ గురించి మాట్లాడుకుందాం. అప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్. కృష్ణా జిల్లా పర్యటనకు రోడ్డు మార్గాన బయలుదేరి వచ్చారు. జగ్గయ్య పేట అడ్డరోడ్డువద్ద సామినేని ఉదయభాను అనుచరులు మరొక కాంగ్రెస్ నేతను చితక బాదారు. ఆ నేత వైఎస్ కారులో ఉన్నా సరే కారు అద్దాలు బద్దలు కొట్టి బయటకు లాగి కొట్టారు. వెంటనే నందిగామలోని వసంత నాగేశ్వరరావు ఇంట్లో మీడియా సమావేశం పెట్టిన వైఎస్ సామినేని ఉదయభానును ఆరేళ్ల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఆరు నెలలకు తిరక్కముందే జరిగిన ఎన్నికల్లో ఉదయ భానుకు టిక్కెట్ వచ్చింది. 1999లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలిచారు.

**ఇప్పుడు మల్లురవి నేతృత్వంలో...**

అట్లుంటుది కాంగ్రెస్ పార్టీ యవ్వారం. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. తనకు బాగా సన్నిహితుడైన నాగర్ కర్నూలు ఎంపీ మల్లురవిని క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ గా నియమించారు.ఈ కమిటీ బెదిరింపులకు కాంగ్రెస్ నేతలు తలొగ్గుతారా? తోకముడుస్తారా? అంటే నవ్వడం మినహా మరొక సమాధానం రాదు. కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ అంటే కోరలు లేని పాము వంటిదని కార్యకర్తల నుంచి నేతల వరకూ అందరికీ తెలుసు. అందుకే ఇప్పుడు ఏర్పడిన క్రమశిక్షణ కమిటీ పార్టీ నేతలపై చర్యలు తీసుకుంటారని భావించడం అత్యాశే అవుతుంది. కొండా మురళిపైనో, మరొకరిపైనో వేటు వేసే ధైర్యం కాదు..కాదు... నిర్ణయం తీసుకునే హక్కు ఈ కమిటీకి లేదనే చెప్పాలి. అందుకే హస్తం పార్టీ అలా ఎప్పుడూ వెలిగిపోతుంది.ం

## కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లోపించింది

- మొదటి పేజీ తరువాయి

జగన్ తెలిపారు. దీంతో మొత్తం బాండ్ల విలువ రూ. 9,000 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏపీ హైకోర్టులో కేసు విచారణలో ఉందని, నోటీసులు కూడా జారీ అయ్యాయని గుర్తుచేశారు. ఈ బాండ్ల ద్వారా సమీకరించిన నిధులను ప్రభుత్వ రెవెన్యూ వ్యయాల కోసం వినియోగిస్తున్నారని స్పష్టమవుతోందని ఆయన ఆరోపించారు.రాజ్యాంగ నిబంధనలను పూర్తిగా విస్మరించి, అపూర్వమైన రీతిలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రైవేటు పార్టీలకు రాష్ట్ర సంఘటిత నిధిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించిందని జగన్ దుయ్యబట్టారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్వారా డైరెక్ట్ డెబిట్ ఆదేశాలు జారీ చేసి, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేకుండానే ప్రైవేటు వ్యక్తులు రాష్ట్ర ఖజానా నుంచి నిధులు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204, 293(1) లను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు.ఎన్‌సీడీ బాండ్లకు అదనపు హామీగా, గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,91,000 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి అయిన ఖనిజ సంపదను కేవలం రూ. 9,000 కోట్ల బాండ్ల కోసం తాకట్టు పెట్టిందని జగన్ విమర్శించారు. రాష్ట్ర సంఘటిత నిధికి ఇలా ప్రైవేటు వ్యక్తులకు అనుమతి ఇవ్వడం, ఇంత భారీ మొత్తంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం చూస్తుంటే, ఈ బాండ్లు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే రాష్ట్ర అభివృద్ధి రుణాల (ఎస్‌డీఎల్) కంటే ఎక్కువ సురక్షితమైనవిగా భావించాలా? అని వ్యాఖ్యానించారు.అయినప్పటికీ, ఏపీఎండీసీ బాండ్లను 9.30 శాతం అధిక వడ్డీ రేటుకు జారీ చేశారని, ఇది ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధి రుణాలపై ఉన్న వడ్డీ రేటు కంటే 2.60 శాతం ఎక్కువని జగన్ తెలిపారు. ఈ అధిక వడ్డీ రేటు కారణంగా ఏపీఎండీసీపై ఏటా అదనంగా రూ. 235 కోట్ల భారం పడుతుందని, ఈ బాండ్ల కాలపరిమితి పదేళ్లుగా ఉందని తెలిసిందని అన్నారు. ఈ అదనపు భారం వల్ల లబ్ధి పొందింది ఎవరో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు.ఈ ఎన్‌సీడీల జారీతో, టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ 13 నెలల కాలంలో సమీకరించిన బడ్జెట్, ఆఫ్–బడ్జెట్ రుణాలు, గత ప్రభుత్వం ఐదేళ్లలో తీసుకున్న రుణాల్లో 50 శాతానికి పైగా ఉన్నాయని జగన్ ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, ప్రభుత్వ రుణాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, పారదర్శకత పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ అభిప్రాయం తెలపండి

- మొదటి పేజీ తరువాయి

మనోహర్ స్పష్టం చేశారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో పలు కీలక సంస్కరణలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారుల అభిప్రాయాలు, ఫిర్యాదులను నేరుగా స్వీకరించేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

**క్యూఆర్ కోడ్‌తో నేరుగా మీ స్పందన**

రేషన్ కార్డుదారులు తమ స్మార్ట్‌ఫోన్లతో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఒక వెబ్ ఫారమ్‌లోకి ప్రవేశిస్తారని మంత్రి నాదెండ్ల వివరించారు. ఈ ఫారమ్‌లో ఆ నెల రేషన్ సరుకులు అందుకున్నారా? లేదా? సరుకుల నాణ్యత ఎలా ఉంది? తూకంలో ఏమైనా తేడాలున్నాయా? రేషన్ డీలర్ ప్రవర్తన, ఏవైనా అధిక ధరలు వసూలు చేశారా? వంటి ప్రశ్నలకు "అవును" లేదా "కాదు" అనే సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులు నమోదు చేసే ఈ వివరాలు, అభిప్రాయాలు నేరుగా ఉన్నతాధికారులకు చేరుతాయని, దీనివల్ల సమస్యలున్న చోట తక్షణమే చర్యలు తీసుకునేందుకు వీలు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం ద్వారానే పౌర సేవలను మరింత మెరుగుపరచాలన్నది మా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

**వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యం**

మరో కీలక నిర్ణయంగా 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఇవాళ్టి నుంచే ప్రారంభించినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. వీరికి ఐదు రోజుల ముందుగానే రేషన్ అందజేయనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా జులై నెలకు సంబంధించిన రేషన్ సరుకుల పంపిణీని కూడా నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు.

# ఇజ్రాయెల్‌పై విజయం సాధించాం, అమెరికాను చిత్తు చేశాం

- మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ఆయన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. "ఎంత గందరగోళం సృష్టించినా, ఎన్ని ప్రకటనలు చేసినా, జియోనిస్ట్ పాలన ఆచరణాత్మకంగా ఇస్లామిక్ రిపబ్లిక్ దెబ్బలకు చిత్తయి, నలిగిపోయింది" అని ఖమేనీ ఒక పోస్టులో పేర్కొన్నారు. దేశ ప్రజలకు ఈ 'విజయం' పట్ల అభినందనలు అంటూ పోస్టు చేశారు.ఆ వెంటనే అమెరికాను లక్ష్యంగా చేసుకుని మరో పోస్ట్ చేశారు. "మన ప్రియమైన ఇరాన్ అమెరికా ప్రభుత్వంపై సాధించిన విజయానికి నా అభినందనలు. జియోనిస్ట్ పాలన పూర్తిగా నాశనమవుతుందని భావించిన అమెరికా ప్రభుత్వం, దానిని కాపాడేందుకే నేరుగా యుద్ధంలోకి దిగింది. కానీ ఏమీ సాధించలేకపోయింది" అని ఖమేనీ అన్నారు.గల్ఫ్‌లో మోహరించిన అమెరికా దళాలపై ఇరాన్ ప్రతీకార దాడిని కూడా ఖమేనీ ప్రస్తావించారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ అమెరికా చెంప చెళ్లుమనిపించింది. ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా స్థావరాల్లో ఒకటైన అల్–ఉదీద్ వైమానిక స్థావరంపై దాడి చేసి నష్టం కలిగించింది" అని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలోని అమెరికా ఆస్తులపై ఇరాన్ ఎప్పుడైనా దాడి చేయగల సత్తా కలిగి ఉందని ఖమేనీ మరో పోస్టులో హెచ్చరించారు. "ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా కేంద్రాలను ఇస్లామిక్ రిపబ్లిక్ చేరుకోగలగడం, అవసరమని భావించినప్పుడల్లా చర్యలు తీసుకోగలగడం ఒక ముఖ్యమైన విషయం. భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్య పునరావృతం కావచ్చు. ఏదైనా దురాక్రమణ జరిగితే, శత్రువు కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు.

# డ్రగ్స్ తీసుకున్న నటులను ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలి

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణను మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, ఈ విషయంలో సినీ పరిశ్రమ కూడా కీలక పాత్ర పోషిస్తుందని ఎఫ్‌డీసీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయనతో పాటు నటులు విజయ్ దేవరకొండ, రామ్ చరణ్ పాల్గొని డ్రగ్స్‌పై తమ గళం విప్పారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, యువతకు దిశానిర్దేశం చేశారు.దిల్ రాజు మాట్లాడుతూ, మలయాళ చిత్ర పరిశ్రమలో డ్రగ్స్ తీసుకున్న వారిని బహిష్కరించే నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. "అక్కడ ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్లు తేలితే, వారిని పరిశ్రమ నుంచి బహిష్కరిస్తారు. తెలంగాణ ఎఫ్‌డీసీ తరపున తెలుగు చిత్ర పరిశ్రమ తరపున నేను కోరేది ఒక్కటే. మన దగ్గర కూడా అలాంటి సంఘటనలు జరిగితే సంబంధిత వ్యక్తులను ఇండస్ట్రీలో అడుగు పెట్టకుండా నిషేధించాలి. అప్పుడే సమాజానికి బలమైన సందేశం వెళుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని చిత్ర పరిశ్రమ పెద్దలతో చర్చించి, తెలుగు సినిమాల్లో కూడా ఈ నిబంధన పాటించేలా చర్యలు తీసుకుంటామని, ఇది మనందరి కర్తవ్యమని దిల్ రాజు పేర్కొన్నారు. డ్రగ్స్ లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు అంతా ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, తాను సాధారణంగా బయటి ప్రపంచానికి దూరంగా ఉంటానని, అయితే యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ ప్రాముఖ్యతను పోలీస్ అధికారులు వివరించిన తర్వాత దీనిపై మాట్లాడటం బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. "ఒక దేశాన్ని నాశనం చేయాలంటే యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. ఆ దేశ యువతకు డ్రగ్స్ అలవాటు చేస్తే సరిపోతుంది. కొన్ని దేశాలు మన యువతకు మత్తు పదార్థాలు అలవాటు చేసి, దేశ భవిష్యత్తును దెబ్బతీయాలని చూస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తాయని, ఒక్కసారి వాటికి బానిసైతే కోలుకోవడం చాలా కష్టమని హెచ్చరించారు. స్నేహితులు డ్రగ్స్ అలవాటు చేస్తే వారికి దూరంగా ఉండాలని, అందరూ ఆరోగ్యంగా ఉంటూ, వ్యాయామం చేస్తూ, తల్లిదండ్రులకు గౌరవం తెచ్చే పనులు చేయాలని సూచించారు. విజయం, డబ్బు, గౌరవం లేని పనులు చేయడం అనవసరమని ఆయన అన్నారు.అనంతరం నటుడు రామ్ చరణ్ మాట్లాడుతూ, తన చిన్నతనంలో పాఠశాల తరపున ఇలాంటి అవగాహన కార్యక్రమాలకు వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. "ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. గతంలో కొన్ని పాఠశాలల బయట డ్రగ్స్ అమ్ముతున్నారని తెలిసి చాలా బాధపడ్డాను. అప్పుడు నేను తండ్రిని కాదు, కానీ ఇప్పుడు నేనొక తండ్రిని" అని ఆయన అన్నారు.ఒక మంచి సినిమా చేసినప్పుడు, పరీక్షల్లో మంచి మార్కులు వచ్చినప్పుడు, స్నేహితులతో ఆడుకున్నప్పుడు కలిగే ఆనందం గొప్పదని, రోజూ వ్యాయామం చేస్తూ నచ్చిన పని చేసుకుంటూ కుటుంబంతో సంతోషంగా ఉండాలని యువతకు సూచించారు. '

'మన కుటుంబంతో మొదలుపెట్టి, పాఠశాల, సమాజాన్ని బాగు చేసుకుందాం. ఈ విషయంలో పోలీసు శాఖ చేస్తున్న కృషి అభినందనీయం. ప్రతి ఒక్కరూ ఒక్కో సైనికుడిలా మారి డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం" అని రామ్ చరణ్ పిలుపునిచ్చారు.

# డ్రగ్స్ పై యుద్ధం...

- మొదటి పేజీ తరువాయి

విలువైన జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల మెడికల్ షాపుల్లో కూడా మత్తుపదార్థాలు అమ్ముతున్నారన్న సమాచారం ఉందని తెలిపారు. "గంజాయిపై రాష్ట్రవ్యాప్తంగా 'ఈగల్' పేరుతో డేగ కన్ను వేసి ఉంచుతాం. ఇప్పటికైనా మారకపోతే అలాంటి వారు రాష్ట్రంలో ఉండేందుకే అనర్హులు. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది" అని తీవ్రంగా హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, "రాష్ట్రంలోని 26 జిల్లాల్లో నార్కోటిక్స్ సెల్స్ ఏర్పాటు చేశాం. పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌లు నెలకొల్పాం. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే '1972' నంబర్‌కు మెసేజ్ పంపితే తక్షణమే రక్షణ చర్యలు తీసుకుంటాం. మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో 2 శాతాన్ని డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాలకు కేటాయిస్తాం. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో 56 డీ–అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సినీనటులు కూడా ముందుకు రావాలని, ప్రజా చైతన్యం కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆరేళ్లుగా పోటీ చేయని రాజకీయ పార్టీలు... ఎన్నికల సంఘం కీలక నిర్ణయం!

- మొదటి పేజీ తరువాయి

గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలను (రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీస్ – ఆర్‌యూపీపీ) గుర్తించి, వాటిని డీలిస్ట్ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఈ పార్టీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో వాటి కార్యాలయాలు కూడా ఉనికిలో లేవని ఎన్నికల సంఘం తన పరిశీలనలో గుర్తించింది. ఈ నేపథ్యంలోనే సదరు పార్టీలను జాబితా నుంచి తొలగించేందుకు ఈసీ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం వద్ద సుమారు 2,800కు పైగా గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయి.సాధారణంగా, ఒక రాజకీయ పార్టీ ఎన్నికల సంఘం నుంచి అధికారిక గుర్తింపు పొందాలంటే, జరిగిన సాధారణ ఎన్నికల్లో పోలైన మొత్తం ఓట్లలో కనీసం ఆరు శాతం ఓట్లు సాధించాలి లేదా నిర్దిష్ట సంఖ్యలో అసెంబ్లీ లేదా లోక్‌సభ సీట్లను గెలుచుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రమాణాలను అందుకోలేని పార్టీలను కేవలం నమోదిత గుర్తింపు లేని పార్టీలుగానే పరిగణిస్తారు. ఇటువంటి పార్టీలు సుదీర్ఘకాలం పాటు ఎటువంటి ఎన్నికల కార్యకలాపాల్లో పాల్గొనకపోవడం, కనీసం పార్టీ కార్యాలయాలను కూడా నిర్వహించకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల సంఘం ఈ ప్రక్షాళన చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

## భారత్‌పై చైనా ఎత్తుగడ! బీజింగ్ నుంచి ఆగిపోయిన స్పెషాలిటీ ఫెర్టిలైజర్స్ సరఫరా

- మొదటి పేజీ తరువాయి

ఈ రకం ఎరువులను ఎగుమతి చేయాలంటే సంబంధిత ఫ్యాక్టరీల నుంచి వచ్చే షిప్‌మెంట్లను చైనా అధికారులు తనిఖీ చేయాల్సి ఉంటుంది. అయితే, భారత్‌కు రావాల్సిన షిప్‌మెంట్లను మాత్రం అధికారులు తనిఖీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలుస్తోంది. దీని ద్వారా, అధికారికంగా ఎలాంటి నిషేధం విధించకుండానే ఎగుమతులను అడ్డుకోవడానికి చైనా ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం.మొక్కలు, చెట్లకు భూమి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన పోషకాలను అందించి, అధిక ఫలసాయం సాధించడానికి ఈ ప్రత్యేక ఎరువులను ఉపయోగిస్తారు. వీటిలో అనేక రకాలు అందుబాటులో ఉన్నాయి. భారత్‌లో ఈ తరహా ఎరువులను పెద్ద మొత్తంలో తయారు చేసుకునే సామర్థ్యం ప్రస్తుతం పరిమితంగానే ఉంది. కొన్ని సంస్థలు చిన్న మొత్తాల్లో స్థానికంగా ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ఆర్థికంగా అవి అంత లాభదాయకంగా లేవు. మన దేశం వినియోగించే ప్రత్యేక ఎరువుల్లో దాదాపు 80 శాతం చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి.గత నాలుగైదేళ్లుగా చైనా ఈ సరఫరాలను నియంత్రిస్తూ వస్తోందని, ఈసారి మాత్రం పూర్తిగా నిలిపివేయడం ఆందోళనకరమని సోలబుల్ ఫర్టిలైజర్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజిబ్ చక్రబర్తి తెలిపారు. సాధారణంగా జూన్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో భారత్ సుమారు 1,50,000 నుంచి 1,60,000 టన్నుల ప్రత్యేక ఎరువులను దిగుమతి చేసుకుంటుందని గణాంకాలు చెబుతున్నాయి.భూసారాన్ని కాపాడుతూ, పంట దిగుబడిని పెంచడానికి రైతులు వీటిని ఎక్కువగా వినియోగిస్తారు. దేశీయంగా ఈ రంగంలో దీపక్ ఫర్టిలైజర్స్, ప్రదీప్ ఫర్టిలైజర్స్, నాగార్జున ఫర్టిలైజర్స్ వంటి కంపెనీలు ప్రధానంగా వ్యాపారం చేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ ఈ ఎరువుల కోసం పశ్చిమాసియా, ఐరోపా దేశాల్లోని ఉత్పత్తిదారుల వైపు చూడాల్సిన అవసరం ఏర్పడింది.గత ఐదేళ్లుగా భారత్–చైనా మధ్య నెలకొన్న దౌత్యపరమైన విభేదాలు, అలాగే పాకిస్థాన్‌తో చైనా సంబంధాలు బలపడటం వంటి అంశాలు ఈ పరిణామాలకు కారణంగా భావిస్తున్నారు. ఇప్పటికే చైనా రేర్ ఎర్త్ మాగ్నెటిక్స్ వంటి కీలక ముడిసరుకుల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. తాజా పరిణామం ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది.

## రాజమండ్రిలో 'అఖండ గోదావరి' పర్యాటక ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేసిన షెకావత్, పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

అఖండ గోదావరి ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులు వారికి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా పర్యాటకం గణనీయంగా వృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. వీరితో పాటు కూటమి ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, గిడ్డి సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, చిర్రి బాలరాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూడా హాజరయ్యారు.అలాగే, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ) ఛైర్మన్ తుమ్మల రామస్వామి, జిల్లా కలెక్టర్ తో పాటు ఇతర జిల్లా అధికారులు, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

### మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై కేసు..

## ఎంపీపీ అరెస్ట్.. వైసీపీ నేతలకు చిక్కులు!

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తి తీవ్రంగా గాయపడి, ఒక కన్నును కోల్పోయారు. ఈ ఘటనపై బాధితులు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ను ఆశ్రయించారు.ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీసులు రంగంలోకి దిగి, బాధ్యులపై చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 19 మంది వైసీపీ నేతలపై కేసు నమోదు చేశారు. నిందితుల జాబితాలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, గడికోట రమేశ్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.ఈరోజు ఉదయం ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిని లక్కిరెడ్డిపల్లి ఇన్‌ఛార్జ్ సీఐ వరప్రసాద్ నేతృత్వంలోని పోలీసు బృందం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో మిగిలిన నిందితులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో జరిగిన ఈ సంఘటన, ఇప్పుడు వైసీపీ నేతలకు న్యాయపరమైన చిక్కులు తెచ్చిపెట్టింది.

## సీఎం చంద్రబాబును కలిసిన కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ స్పష్టం చేశారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆయన సమావేశమయ్యారు. సీఎం చంద్రబాబుతో ఏపీ అభివృద్ధి, కేంద్ర సహకారంపై చర్చించారు. అంతకుముందు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కేంద్ర మంత్రి షెకావత్‌కు స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి షెకావత్ ఇవాళ రాజమండ్రిలో అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని తెలిపారు. "అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రధాని మోదీ దార్శనికతతో దేశంలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల రూపకల్పనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు."డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. దేశంలోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా కూడా పర్యాటకుల రాక గణనీయంగా పెరిగింది, ముఖ్యంగా భారత్‌లో ఈ వృద్ధి వేగంగా ఉంది" అని షెకావత్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం ఉందని, రాష్ట్రం ఆధ్యాత్మికంగా కూడా పురోగమిస్తోందని ఆయన అన్నారు.రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం సుమారు రూ.450 కోట్లకు పైగా నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని షెకావత్ వెల్లడించారు. "స్వదేశీ దర్శన్, ప్రసాద్, సాక్షి, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ (సీబీడీడీ) వంటి వివిధ స్కీమ్‌ల ద్వారా కేంద్రం పర్యాటక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. స్వదేశీ దర్శన్ 2.0 కింద అరకు, బొర్రా గుహలు, లంబసింగి, సూర్యలంక బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నాం. ప్రసాద్ స్కీమ్ ద్వారా ఆధ్యాత్మిక టూరిజానికి బాటలు వేస్తున్నాం" అని తెలిపారు. అమరావతి, శ్రీశైలం దేవాలయాల్లో భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పనులు కొనసాగుతున్నాయని, అన్నవరం దేవాలయంలో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని ఆయన వివరించారు.

**అన్ని విధాలా కేంద్రం సహకారం: పురందేశ్వరి**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని తాము గతంలోనే చెప్పామని గుర్తుచేశారు. ప్రజలు తమపై నమ్మకంతో ఆశీర్వదించి గెలిపించారని ఆమె అన్నారు. "వికసిత్ భారత్‌లో వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఒక భాగం కావాలి. అమరావతి, పోలవరం వంటి అన్ని కీలక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది" అని పురందేశ్వరి తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి కేంద్రం సహాయం అందిస్తోందని, అనేక పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శంకుస్థాపనలు చేసుకుంటున్నామని ఆమె వివరించారు.

## డాకింగ్ విజయవంతం... అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

- మొదటి పేజీ తరువాయి

(ఐఎస్ఎస్) విజయవంతంగా అడుగుపెట్టారు. వారి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానమయ్యే (డాకింగ్) ప్రక్రియ గురువారం సాయంత్రం విజయవంతంగా పూర్తయింది. ఈ ఘనతతో అంతరిక్ష యాత్రల్లో భారత్ తనదైన ముద్రను మరోసారి చాటింది.

వివరాల్లోకి వెళితే, యాక్సియం–4 మిషన్‌లో భాగంగా భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలాండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ -విస్నీవ్స్కీ, హంగరీకి చెందిన టిబర్ కపులు అంతరిక్షయానం చేపట్టారు. భారత కాలమానం ప్రకారం బుధవారం (జూన్ 25) మధ్యాహ్నం 12:01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఫాల్కన్–9 రాకెట్ ద్వారా వీరి స్పేస్‌క్రాఫ్ట్ నింగిలోకి దూసుకెళ్లింది.


దాదాపు ఒక రోజు ప్రయాణం అనంతరం, గురువారం (జూన్ 26) సాయంత్రం ఈ వ్యోమగాముల బృందం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4:03 గంటలకు స్పేస్‌క్రాఫ్ట్‌ను ఐఎస్ఎస్‌తో అనుసంధానించే డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. అనంతరం వ్యోమగాములు నలుగురూ

ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. ఈ మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా సహా వ్యోమగాముల బృందం 14 రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడపనుంది. ఈ సమయంలో వారు పలు పరిశోధనలు, ప్రయోగాలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ విజయం భారత అంతరిక్ష పరిశోధనా కార్యక్రమాలకు మరింత ఊతమిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి

**కఠిన కారాగార శిక్ష మరియు రూ.1,00,000/- జరిమానా**

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 26 :** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు రూ.1,00,000/- జరిమానా, బాధితురాలికి రూ.3,00,000/- నష్ట పరిహారం విధించిన పోక్సో కోర్టు.పద్మనాభం పోలీస్ స్టేషన్ పరిధిలో 10 సంవత్సరాల మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో, ముద్దాయి అయిన బంగారి ఈశ్వర రావు కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,00,000/- జరిమానా, బాధితురాలికి రూ.3,00,000/- నష్ట పరిహారం విధిస్తూ సంచ లన తీర్పు వెలువరించిన పోక్సో కోర్టు. ముద్ధా యికి శిక్ష పడేవిధంగా కృషి చేసిన అధికారులకు డా. ఏ. శంఖబ్రత బాగ్చి, ఐ.పీ.ఎస్, కమీషనర్ ఆఫ్ పోలీస్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ అభినందించారు.




పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## రాజకీయ పార్టీల నేతల సమక్షంలో

# గోదాములను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఈవీఎం గోదాముల వద్ద అప్రమత్తంగా ఉండాలి.**

**భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు**

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, జూన్ 26 :** ఈవీఎం గోదాముల వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గ్రామీణ మండ లం చినగదిలిలో ఉన్న ఈవీఎం గోదాములను గురువారం ఉదయం భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితుల ను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. తాళాలు తీయించి గోదాముల లోపల భాగంలో కూడా పర్యటించారు. అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై కలెక్టర్ కాసేపు నేతలతో మాట్లాడారు. పార్లమెంటు, అసెంబ్లీల వారీగా భద్రపరిచిన ఈవీఎంల స్థితిగతులను కలెక్టర్ కు ఎన్నికల విభాగం అధికారులు వివరించారు.పర్యటనలో ఆయన వెంట భాజపా నేతలు పరశురామ రాజు, రమేశ్, తెదేపా నేతలు దొరబాబు, దేవీ పరమేశ్వరరా వు, అప్పలస్వామి, వైకాపా నేత కృష్ణకాంత్, బీఎస్పీ నేత శివప్రసాద్, స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# మాదక ద్రవ్యాల వినియోగం సమాజానికి చేటు







- **గంజాయి నిర్మూలన బాధ్యత అందరిపైనా ఉంది**
- **డ్రగ్స్ వద్దు బ్రో నినాదాలతో భారీ ర్యాలీ**
- **మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు**
- **జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూన్ 26:** మాదక ద్రవ్యాల వినియోగం సమాజానికి చేటు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేసారు. జిల్లాలో గంజాయి సమూలంగా నిర్మూలించడానికి అందరూ సహకారం అందించాలని పిలుపు నిచ్చారు.గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సం (నషా ముక్తి భారత్ అభియాన్) సందర్భంగా ఐటిడి ఏ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో మాదక ద్రవ్యాల చెడు ప్రభావరం పై అందరికి అవగాహన ఉండాలన్నారు. జిల్లా కేంద్ర లో 10 మందితో డీ ఎడిక్షన్ సెంటర్ ప్రారంభించామని, ప్రస్తుతం 150 మంది మత్తు విముక్తిపై వైద్యం అందిస్తున్నామన్నారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల భారిన పడిన బాధితులు ఉంటే డీ ఎడిక్షన్ సెంటర్కు తరలించాలని సూచించారు. జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య, స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ సమావేశాలు, ఆశ్రమ పాఠశాలలు, యువ గ్రూపులు, సఖీ గ్రూపులలో గంజాయి సాగు, వినియోగంపై తీర్మానాలు చేయాలని సూచించారు. గ్రామాలలో గడప గడపకు గంజాయి నిర్మూలన పై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతీ 15 రోజులకు ఒక సారి గంజాయి సాగు నిర్మూలన పై చర్చ జరగాలన్నారు. అనంతరం డ్రగ్స్ వద్దు బ్రో అంటూ అందరితో నినాదాలు చేయించారు. మాదక ద్రవ్యాలు వినియోగించనని ప్రతిజ్ఞ చేయించారు.ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో నషా ముక్తి భారత్ అభియాన్ ర్యాలీని విజయవంతం చేసారన్నారు.యోగాకు అల్లూరి సీతారామ రాజు జిల్లా సింబల్ గా మారిందన్నారు. గత ఏడాది 10 వేల ఎకరాల్లో గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా పంటలు సాగు చేయడానికి విత్తనాలు, మొక్కలు రైతులకు పంపిణీ చేసామన్నారు. స్మగ్లర్లు బయట ప్రాంతాల నుండి గిరిజన ప్రాంతానికి వచ్చి గిరిజనులను పక్కదారి పట్టించి మోసం చేస్తున్నారని చెప్పారు గంజాయి స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకుని జైలు పంపిస్తామని హెచ్చరించారు. గంజాయిని సమూలంగా నిర్మూలించడానికి అందరూ సహకారం అందించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని చెప్పారు.మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ గిరిజనులు పుట్టుడం అదృష్టం గా భావిస్తున్నానన్నారు.గంజాయి సాగు నిర్మూలనపై గిరిజన గ్రామాలలో అవగాహన కల్పిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, మాదక ద్రవ్యాల నివారణకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ప్రణాళికాబద్దంగా చర్యలు చేపట్టారని చెప్పారు. జిల్లాలో గంజాయి సాగు నిర్మూలనకు పోలీసు అధికారులు కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. చుట్టా, బీడి, గుట్కాలు, గంజాయి వినియోగించడం వలన చాలా మంది కాన్సర్ భారిన పడుతున్నారని అన్నారు. యువత మత్తు పదార్ధాల వినియోగానికి దూరంగా ఉండాలని చెప్పారు.పిల్లల ప్రవర్తన ఎటువైపు వెళుతున్నారో తలిదండ్రులు గమనించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ధీరజ్, చింతపల్లి ఎఎస్పీ నవజ్యోతి మిశ్రా, ఐసిడిఎస్ పిడి ఝాన్సీ, ఎక్సైజ్ సూపరిండెంట్ ఆర్.గౌరీ శంకరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.టి. హేమలతా దేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్. టి. విశ్వేశ్వర నాయుడు, డి ఎసిపి షేక్ అహ్మద్ షెహబాజ్, మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి. ఎస్. ఎన్.రాజు, స్థానిక నేతలు బొర్రా నాగరాజు, బొర్రా విజయరాణి, లగిశపల్లి సర్పంచ్ పార్వతమ్మ, సిడిపిఓలు, పలువురు వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు, వివిద పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి రాక కోసం విద్యార్థుల నిరీక్షణ

- గొందిపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యా సంక్షోభం
- గ్రామస్థుల విజ్ఞప్తికి అధికారులు స్పందించాలన్న డిమాండ్





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 26:** అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్తవీధి మండలం, జీకే వీధి పంచాయతీ పరిధిలోని గొందిపల్లి గ్రామంలో ఉన్న జి.పి.ఎస్.టి.డబ్ల్యూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రస్తుతం ఉపాధ్యాయుడిలేక విద్యా వెలితిని ఎదుర్కొంటోంది. సుమారు 40 మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాలలో పునఃప్రారంభం అయిన రెండు వారాలు గడుస్తున్నా, కొత్త ఉపాధ్యాయుని నియామకం జరగలేదు.ఇప్పటి వరకు పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని తెలుస్తోంది. దీంతో విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకి వచ్చి నిరుత్సాహంగా తిరిగి వెళ్తున్నారు. ఉపాధ్యాయులే లేని తరుణంలో, చదువు పరంగా వారు తీవ్రంగా వెనుకబడే పరిస్థితి ఏర్పడుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు తక్షణ చర్యలు తీసుకోవాలంటూ మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం సమర్పించారు. "పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని మా పాఠశాలకు వెంటనే ఉపాధ్యాయుని నియమించాలి" అంటూ కోరుతున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు పాఠశాల చైర్మన్ కె. రమేష్, వైస్ చైర్మన్ డి. కన్నమ్మ లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కె. రామకృష్ణ, కె. బాలరాజు, కె. వెంకటేష్, బి. సరోజ, కె. దారామణి, బంగారమ్మ, సతీష్, లక్ష్మీనారాయణ, చిన్నబ్బాయిలు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో విద్యా శాఖ వెంటనే స్పందించి, గొందిపల్లి పాఠశాలకు నూతన ఉపాధ్యాయుని నియమిస్తే, గ్రామ విద్యార్థుల ఆశలకి న్యాయం జరిగే అవకాశం ఉంది.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్






**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూన్ 26:** జూలై 01వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా (పాడేరు) లో జరుగనున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించనున్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేస్తున్న నేపథ్యంలో సంబంధిత పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్, ఇతర అధికారులతో కలసి గురువారం ఉదయం పాడేరు మండలం లగిశపల్లిలో హెలిపేడ్ స్థలాన్ని, బహిరంగ సభ నిర్వహణ స్థలాన్ని అలాగే పెన్షన్ పంపిణీ ఉగ్గ%శీ% గొయ్యి గ్రామంలో పరిశీలించారు. ముఖ్యమంత్రి సభాస్థలికి చేరుకునే దగ్గర నుంచి తిరుగుపయనమయ్యే వరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎం.జె.అభిషేక్ గౌడ, ఎ.ఎస్.పి ధీరజ్, డి.ఎస్.పి షేక్ అహమ్మద్ షెహబాజ్,ఎ.ఎస్.పి జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి పి మురళీ, తహసీల్దార్ వి. త్రినాథరావు నాయుడు తదితరులు.

# ప్రమాదకరంగా మారిన రహదారి - పట్టించుకోని అధికారులు

**సుమారు 200 మీటర్లు బురదమయంగా మారి నిత్యము ప్రమాదాలు జరుగుతున్నా ఘటన.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 26.** మండలంలో గల గుమ్మసిరిగంపుట్టు సమీపంలో బరడ వైపు వెళ్లే జంక్షన్ వద్ద సుమారు 200 మీటర్లు మట్టి రోడ్డు బురద మాయంగా మారి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పడుతున్న వర్షాలతో రోడ్లన్నీ బురద మయంగా మారడంతో అటువైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ద్విచక్ర వాహనాల మీద నుండి జారిపడి గాయాలు పాలైన పరిస్థితి ఉందని, కనీసం ప్రజా ప్రతినిధులు గాని అధికారులు గాని కన్నెత్తి చూడకపోవటం విడ్డూరంగా ఉందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుమ్మ సిరగంపుట్టు గ్రామం జంక్షన్ నుంచి బరడ, లక్ష్మీపురం మీదుగా బుంగాపుట్టు వరకు ఈ మార్గం గుండా నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగుతుంటాయని, గతంలో లక్ష్మీపురం వరకు రహదారి నిర్మాణ సమయంలో సుమారు 200 మీటర్లు తారు వేయకుండా మానేయడంతో ఈ దుర్భార పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యము బరడ, లక్ష్మీపురం బుంగాపుట్టు పంచాయితీల ప్రజలు, ఉపాధ్యాయులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. కొద్ది దూరం రోడ్డు నిర్మాణానికి గతంలో అనేకమార్లు అధికారుల దృష్టికి, ప్రజా ప్రతిని దృష్టికి తీసుకెళ్లిన ఫలితం మాత్రం శూన్యం. అధికారులు ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయాప్రాంతవాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# సామాన్య కార్యకర్త నుండి ఏఎంసి చైర్మన్గా జివిఆర్





- అయ్యన్నకు వీర విధేయుడుగా గుర్తింపు
- నేడు ప్రమాణస్వీకారం

**నర్సీపట్నం, పెన్ పవర్ (జూన్ 26) :**నర్సీపట్నం మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా మున్సిపాలిటీలో బలిఘట్టంకు చెందిన గవిరెడ్డి వెంకటరమణ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మొదట ఈ పదవికి మాకవరపాలెం మండలానికి చెందిన రుత్తల శేషు కుమార్ పేరును ప్రకటించారు. అయితే ఆయన అనారోగ్యంతో మృతి చెందడంతో, ఈ పదవి మరొక మండలానికి చెందిన నాయకుడికి ఇవ్వాలనే చర్చ పార్టీ వర్గాల్లో జరిగింది. అయితే అయ్యన్నపాత్రుడు తనకు అత్యంత ఆప్తుడైన గవిరెడ్డి రమణకే ఇవ్వాలని ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. దీంతో గవిరెడ్డి రమణను మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వచ్చాయి. భారీ జన సందోహం మధ్య పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సాధారణ కార్యకర్తగా తెలుగుదేశం పార్టీలో ప్రయాణం మొదలుపెట్టిన గవిరెడ్డి వెంకటరమణ, నేడు ఏఎంసి చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆది నుండి రమణ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించడంతోపాటు అయ్యన్న కుటుంబంతో సన్నిహితంగా ఉండేవారు. అయ్యన్న ఏ బాధ్యత అప్పగించినా విజయవంతంగా పూర్తి చేసి ఆయన ప్రశంసలు పొందుతూ వచ్చారు. అయ్యన్నకు అత్యంత నమ్మకస్తుడిగా పార్టీలో ఎదిగారు. సుదీర్ఘ కాలంగా పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నేడు చైర్మన్గా గవిరెడ్డి రమణతోపాటు, వైస్ చైర్మన్ గా చిటికెల కన్నయ్యనాయుడు మరో 13 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లా స్థాయిలో పార్టీ నాయకులు, అధికారులు భారీగా తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు పూర్తి చేశారు.

## రెవెన్యూ అధికారులారా కోర్టును ధిక్కరించవద్దు:ఆదివాసీ జెపసి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 26:**రెవెన్యూ అధికారులారా ఆర్ అండ్ బి రోడ్ల విస్తరణ విషయంలో కోర్టు ధిక్కరణకు పాల్పడవద్దని ఆంధ్ర ప్రదేశ్ ఆదివాసీ జెఏసి రాష్ట్ర వైస్ ఛైర్మన్ మొట్టడం రాజబాబు హెచ్చరించారు.ఆర్ అండ్ బి రోడ్డుకి ఇరువైపులా 50,50 అడుగుల వరకు ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు ఆదేశాలు అనుగుణంగా రోడ్డుకు కుడి, ఎడమ వైపున 50,50 అడుగుల వరకు ఆక్రమణలు తొలగించాలని సంబంధిత అక్రమణదారులకు నోటీసులు జారీ చేయగా,షాపులకు ఎదురుగా ఉన్న ఫ్లెక్సీల మాత్రమే తొలగించారు కొందరు,కొందరు రెవెన్యూ అధికారులకు ముడుపులు కట్టగా,5 అడుగుల వరకు తొలగించాలని కొందరు, 15 అడుగులను మరికొందరు శెలవిచ్చారు.యోగాంధ్ర కార్యక్రమంలో బిజీ అయిపోయిన కలెక్టర్ తమని పట్టించుకోరని రోడ్డు ఇరువైపులా ఆక్రమణల జోలికి పోకుండా కాలాయాపన చేస్తున్నారని,కొందరు ఎంపీపీలు, వర్తక సంఘం నాయకులు షాపుల యజమానుల వద్ద డబ్బులు వసూలు చేసి కొంత డబ్బు అధికారులకు,కొంత డబ్బు తాం ఉంచుకొంటున్నారు.సమయం వచ్చినప్పుడు పేర్లు బయట పెడతామన్నారు. హైకోర్థ్ ఆదేశాలను పాటించని అధికారులపై కోర్టు ధిక్కరణ కింద ఎందుకు కేసు నమోదు కాకూడదోనని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లెటర్ వ్రాస్తామని,సంబంధిత అధికారులు భారత రాజ్యాంగంలో ఆదివాసీలకు కేటాయించిన హక్కులు, చట్టాలు సక్రమంగా అమలు చేయకపోగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా ధిక్కరిస్తున్నారని తెలియపరుస్తామని ఆయన అన్నారు.

## ఉక్కు నెహ్రు అవార్డు గ్రహీత కి ఘన సన్మానం



**గాజువాక :పెన్ పవర్,జూన్ 26:**ఉక్కు ట్రాఫిక్ డిపార్ట్మెంట్ లో క్రమశిక్షణ, నిబద్ధత పని చేసి నెహ్రు అవార్డు పొంది ఈ నెల ఉద్యోగ విరమణ చేస్తున్న పేదిరెడ్ల హరనాథ్ ని డిపార్ట్మెంట్ యువ కార్మికులు ఘనంగా సత్కరించారు. ముందు గా దుస్సాలువ తో సన్మానించి, మెమంటో అందజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ కర్మాగారం కోసం కష్టపడి పని చేయాలని భద్రత కి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమం లో డిపార్ట్మెంట్ ఏజిమ్ సిహెచ్ రమేష్,యువ కార్మికులు మాటూరి రాము, తారక్, నాగ సాయి,దశమంత్రి శ్రీనివాస్, సుందర్, ఆర్డీ ప్రసాద్, రమణ, సీతారాం, శ్యామ్ , అశోక్,వర్మ, శంకర్, మురళి, కిరణ్, సన్నీ, పానీగ్రహీ, అప్పలరాజు, ఎర్రం నాయుడు, శ్రీను, రవి రాఘవ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు విరమణ ఉద్యోగులకు ఘన సన్మానం




**గాజువాక :పెన్ పవర్,జూన్ 26:**విశాఖ ఉక్కు కర్మాగారం లో మూడు దశాబ్దాలు పైగా విధులు నిర్వహించి ఈ నెల 30 న ఉద్యోగ విరమణ పొందుతున్న స్టీల్ టీ ఎన్ టి యు సి అధ్యక్షుడు గుమ్మడి నరేంద్ర కుమార్ యుటిలిట్స్ ,ఉపాధ్యక్షుడు పెద్దాడ సోమినాయుడు సింటర్ ప్లాంట్ లకు చిరు ఆత్మీయ సత్కారం గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో స్టీల్ టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాజువాక నియోజక వర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీను ముఖ్య అదితిగా పాల్గొని మాటలు ఆడుతూ కార్మిక సంక్షేమం కోసం రాజీ లేని పోరాటం చేయాలి అని అన్నారు రాష్ట్ర టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్ బాబు మాటలు ఆడుతూ ఉద్యోగులు గా ఉక్కు కర్మాగారం ప్రగతికి కృషి చేస్తూ టి ఎన్ టి యు సి యూనియన్ బలోపేతానికి కృషి చేశారు అని కొనియాడారు ఈ కార్యక్రమం లో గుమ్మడి నరేంద్ర కుమార్ పెద్దాడ సోమినాయుడు లును జ్ఞాపికలు బోకేలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమం లో యూనియన్ నాయుకులు మండవ రఘు ప్రసాద్ కోడూరు సత్యనారాయణ బడే చిన్నారావు పంచదార్ల పెంటరావు జి అంజిబాబు వీరమాచనేని ప్రసాద్ ఎస్ రవికుమార్ కోన సోమినాయుడు మొల్లి రమేష్ గొర్లె మధు సామోజు ఆచారి మడగల జగదీష్ నామాల శ్రీకాంత్ ఎన్ రాంబాబు వియ్యపు అప్పలరాజు రమణ తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి టౌన్ ప్లానింగ్ లో నోటీస్ నాటాకాలు

- అనుమతులు గృహ నిర్మాణానికి...
- నిర్మిస్తున్నది వాణిజ్య సముదాయం



**అనకాపల్లి, పెన్ పవర్, జూన్ 26:** పట్టణంలోని మెయిన్ రోడ్ లో నిబంధనలు ఉల్లంఘించి షాపింగ్ మాల్ కడుతున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్ లో ఉన్న రాతిమేడా పక్కన నిర్మిస్తున్న షాపింగ్ మాల్ కు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ లో నిబంధన ప్రకారం గృహ నిర్మాణానికి అనుమతులు పొంది అందుకు విరుద్ధంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తగినంత స్థలం లేకపోవడం ఉన్న స్థలంలో గృహ నిర్మాణానికి తప్ప వాణిజ్య సముదాయానికి అనుమతులు లభించవు. అక్కడున్న పరిస్థితులను బట్టి గృహ నిర్మాణానికి అనుమతులు తీసుకొని వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారు. నిబంధన ప్రకారం నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో నిర్మాణానికి సంబంధించి ప్లాన్ ను అందరికీ కనిపించేలా వేలాడదీయాలి. అక్కడ జరుగుతున్న నిర్మాణంలో లోపాలు కారణంగా అటువంటిది ఏది ఎక్కడ లేదు. నిబంధనల ప్రకారం ముఖ్యంగా వాణిజ్య సముదాయానికి సెట్ బ్యాక్ లు చాలా అవసరం. అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు ఫైర్ ఇంజన్ వాణిజ్య సముదాయం చుట్టూ తిరిగేలా సెట్ బ్యాక్ లు అవసరం. ఇక్కడున్న పరిస్థితుల్లో నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం కూడా భవిష్యత్తులో అగ్ని ప్రమాదం జరిగితే భారీ మూల్యం చెల్లించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనిపై ఫిర్యాదులు రావడంతో జీవీఎంసీ సిబ్బంది ద్వారా నోటీసులు జారీ చేశారు. అది కూడా తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు లేదా ఉన్నత అధికారులు దృష్టికి వెళితే తమ నోటీసులు జారీ చేశామని చూపి తప్పించుకున్న ప్రయత్నంలో భాగంగా స్థానిక జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఏపీ మున్సిపల్ ఆక్ట్ 1965 ప్రకారం నోటీసులు జారీ చేసి కొంత గొడుగు ఇవ్వడం జరుగుతుంది. నోటీస్ నిర్మానుదారుడు నుంచి సరైన సమాధానం గాని నిర్మాణ నిబంధనల ప్రకారం సరి చేసుకోవడం గాని జరగాలి అలా జరిగిన పక్షంలో జీవీఎంసీ అధికారులు ఫైనల్ నోటీస్ ఇచ్చి అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని కూల్చాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ నిర్మాణదారుడు టౌన్ ప్లానింగ్ అధికారులు మధ్య బేరసారాలు కుదరడంతో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ఆరోపణలు వెల్లువొత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో అక్రమ నిర్మాణదారుడు భారీగా ముట్ట చెప్పినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో నిబంధనలు విరుద్ధంగా నిర్మించిన షాపింగ్ మాల్స్ లో భారీ అగ్నిప్రమాదాలు జరిగి తీవ్రమైన ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరిగిన సంఘటనలు ఉన్నాయి. గతం నేర్పిన అనుభవాలను పట్టించుకోకుండా డబ్బుల కోసం జీవీఎంసీ అధికారులు అక్రమ కట్టడాలను ప్రోత్సహించడం పై పట్టణ పౌరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అవకతవకలపై గతంలో అనకాపల్లి ఏసీబీ అధికారులు విచారణ జరిపి అక్రమ కట్టడాలకు అధికారులు ప్రోత్సహిస్తున్నట్లు అక్రమంగా నిర్మిస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదిక పంపిన దాఖలాలు ఉన్నాయి. తక్షణం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మెయిన్ రోడ్ లో నిర్మిస్తున్న నిర్మాణం పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. .

## దామనపల్లి రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి






- విత్తనాల పంపిణీలో అవినీతి జరగలేదు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్ జూన్ 26:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని దామనపల్లి పంచాయతీ కేంద్రంలో ఉన్న రైతు సేవా కేంద్రాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.వో. మధుసూదన్ రావు గురువారం పరిశీలించారు. విత్తనాల పంపిణీలో అవకతవకలు జరిగాయని కొన్ని సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులపై స్పందించిన ఆయన, స్థానికంగా ఉన్న విత్తనాల నిల్వలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత శుక్రవారం అర్హులైన రైతులకు సబ్సిడీ ధరకు విత్తనాల పంపిణీ జరిగిందని, అయితే వర్షం కారణంగా రైతులు తమ విత్తనాల సంచులను అదే కేంద్రంలో ఉంచి, బుధవారం ప్రైవేట్ వాహనాల ద్వారా తమ ఇళ్లకు తరలించుకున్నారని తెలిపారు. బుధవారం అగ్రికల్చర్ అసిస్టెంట్ సెలవులో ఉండటం వల్ల స్టోర్ తాళాలు అతని వద్దే ఉన్నాయని, ఆ రోజు ఎటువంటి పంపిణీ జరగలేదని స్పష్టం చేశారు. శుక్రవారం పంపిణీ చేసిన విత్తనాలను మాత్రమే రైతులు తరలించుకున్నారని, ఇందులో ఎటువంటి అక్రమాలు జరగలేదని చెప్పారు.రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించిన మధుసూదన్ రావు, సబ్సిడీ విత్తనాలు కావాల్సిన అర్హులైన రైతులు రైతు సేవా కేంద్రానికి వచ్చి పొందవచ్చునని తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్కు, అర్హులైన రైతులకు మాత్రమే పంపిణీ జరగాలని సూచనలు ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా జరిగిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన "పంటల బీమా పాఠశాల" కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుందేరి రామకృష్ణతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంటల బీమా పై రైతులకు అవగాహన కల్పించారు. తమ పంటలకు బీమా చేసుకోవాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో దామనపల్లి పేసా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రైతులు మరియు ఇతర స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.




## లంకెలపాలెంలో రోడ్డు ప్రమాదాలను నివారించండి

- అనకాపల్లి జిల్లా ఎస్.పికీ వినతి పత్రం సమర్పించిన ప్రజా రాజకీయ ఐక్యవేదిక



**అనకాపల్లి, పెన్ పవర్, జూన్ 26:**లంకెలపాలెం నేషనల్ హైవే మీద సిగ్నలింగ్ పాయింట్ దగ్గర జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాల పై ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ గాడి బాలు యువభారత్ సొసైటీ కన్వీనర్ సూది కొండ మాణిక్యాలరావు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ను కలిసి వివరించారు.

లంకెలపాలెం జంక్షన్ రోడ్డు ప్రమాదాలకు కారణం వేగ నియంత్రణ లేకపోవడమేనని ఎగువ నుండి దిగువకు వచ్చేటప్పుడు వాహన చోదకులకు సరిగా కనిపించక సిగ్నలింగ్ వ్యవస్థ ఒకటి ఉన్నది అన్న అంచనా వెయ్యలేక పోవడం, అతి వేగంతో దిగువకు రావటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి అని, అధిక సంఖ్యలో గాజువాక నుండి అనకాపల్లి వైపు వచ్చే దిశలో మాత్రమే రోడ్డు ప్రమాదాలు సిగ్నలింగ్ పాయింట్ దగ్గర ఎక్కువగా జరుగుతున్నాయని వివరించారు.

లంకెలపాలెం జంక్షన్ సిగ్నల్ పాయింట్ దగ్గర సిగ్నల్ పడినప్పుడు అనకాపల్లి దిశగా వచ్చినటువంటి వాహనదారులు ఆగి ఉన్నప్పుడు పెద్ద పెద్ద వాహనాలు అధిక వేగంతో వచ్చి వారిని ఢీకొట్టి తొక్కుకుని వెళ్లిన సంఘటనలు అధికంగా నమోదయినాయి అని వివరించారు. తక్షణమే స్పందించి లంకెలపాలెం ఎగువ నుండి సిగ్నల్ వ్యవస్థ వరకు భారీక్యాడ్లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసి వేగ నియంత్రణ చర్యలు చేపడితే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. దీనిపై ఎస్.పి సానుకూలంగా స్పందించారు.

## చాపరాయి జలవిహారిని సందర్శించిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి.



**డుంబ్రిగుడ పెన్ పవర్,జూన్ 26:**–ఆంధ్ర ఊటీగా పేరుగాంచిన అరకు అందాలు ప్రకృతి ఒడికి కమనీయంగా ఉన్నాయని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నలిన్ కుమార్ శ్రీ వాత్సవ అన్నారు. అరకు అందాలను తిలకించేందుకు కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన అంజోడా సిల్క్ ఫాం పైనరీ, పర్యాటక కేంద్ర చాపరాయి జలపాతంలో ఆయన సందర్శించారు. దీనికి ముందుగా అరకు ప్రధమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి రాము సాదరంగా స్వాగతం పలికారు. ఆయా పర్యాటక కేంద్రాల్లో చుట్టూ కొండలు, పచ్చని అందాలున్న జలవిహారిని తిలకించారు. ఏఎస్ఐ పురంధర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 33వ వార్డు అధ్యక్షుడిగా ముత్తాబత్తుల

- ఎస్సీ వర్గానికి కేటాయించడం పట్ల వార్డు నేతల హర్షం..
- గజమాలతో సత్కరించి వాసుపల్లికి కృతజ్ఞతలు వెల్లువ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 26 :**మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వ యకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆశీస్సులతో 33 వ వార్డు అధ్యక్షుడిగా నియమించడం పట్ల ముత్తాబత్తుల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆశీలమెట్ట కార్యాలయంలో 33 వ వార్డు నేతలతో కలిసి ముత్తా బత్తుల రమేష్ గురువారం ఉదయం భారీ గజమాల వేసి పూల కిరీటంతో వాసుపల్లిని ఘనంగా సత్కరించారు.

వాసుపల్లి గణేష్ కుమార్ కి శుభాకాంక్షలు తెలి యజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా వైఎస్ఆర్సిపి నడుస్తోందన్నారు. మహనీయుల అడుగుజాడల్లో జగన్మోహన్ రెడ్డి పేదలకు, అణగారిన వర్గాలకు ప్రభుత్వ పథకా లు ద్వారా చేయూతనఅందించారన్నారు. అలాగే ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించింది వైఎస్ఆర్సిపి పార్టీనే అన్నారు. 33 వ వార్డు లో వైఎస్ఆర్సిపి అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఎస్సీ వర్గానికి చెందిన ముత్త బత్తుల రమేష్ కి వార్డు అధ్యక్షు డిగా కేటాయించడం జరిగిందన్నారు. కులాలు మతాల ద్వారా విడగొట్టి అట్టడుగు వర్గాలను అణిచివేస్తున్న కూటమి ప్రభుత్వానికి వైయస్సా ర్సీపి తగిన గుణపాఠం చెబుతాదని హెచ్చ రించారు. ముత్తాబత్తుల రమేష్ మాట్లాడుతూ వార్డులో వైఎస్ఆర్సిపి బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. వాసుపల్లి గణేష్ కుమార్ అందించిన సహకారానికి రుణపడి ఉంటానని రమేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ విశాఖ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్, వార్డు అధ్యక్షులు దశమంతరావు చిన్ని, వార్డు అధ్యక్షులు ముజీబ్ ఖాన్, వార్డు అధ్యక్షు లు బీసెట్ ప్రసాద్, సౌత్ సోషల్ మీడియా అధ్యక్షులు బెవరా మహేష్ ,సౌత్ ఏసీ సెల్ నాయకులు ఆకులశ్యాము , సౌత్ యూత్ అధ్యక్షులు తాడి రవితేజ,, సాగర్, 33 వ వార్డు నాయకులు,మాజీ కార్పొరేటర్ పచ్చరపల్లి లక్ష్మి రాము , సౌత్ కల్చర్ వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, వార్డ్ యూత్ నాయకుడు బూర్గుల చిన్న, వాటి సీనియర్ నాయకులుఆడారి వెంకట మహేష్, వార్డు సీనియర్ నాయకులు పివిఎన్ రెడ్డి ,కృష్ణారెడ్డి, సంతోష్, సుగుణ కుమార్ ,శివ సంతోష్, వార్డు మహిళా సీనియర్ నాయకులు లక్ష్మీకాంతం, కోల్లి సత్యవతి, చంద్ర కళ, హేమ, శిరీష, మంగం పార్వతి, వాసుపల్లి గణేష్ కుమార్ ఫాలోవర్స్ పులి ,రంజిత్, సత్తి బాబు ,సతీష్, మహేష్ రాజేష్ , అచ్యుత్, 33వ వార్డు నుంచి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలియ జేశారు.

## హత్య కేసులు చేదించిన న్యూ పోర్ట్ పోలీసులు



**గాజువాక: పెన్ పవర్, జూన్ 26:** పెద్ద గంట్యాడ మండలం ఆటోనగర్ శ్రీ కృష్ణ ఇంజనీరింగ్ యార్డ్ లో జరిగిన హత్య కేసును న్యూ పోర్ట్ పోలీసులు చేదించారు పోలీసుల తెలిపిన కేసు వివరాలు

రాడ్ బెండింగ్, డీ కాయిలింగ్ పని చేసి వ్యక్తి జగదల్ పూరీ, బిలోరి గ్రామము, పార్ప పీ ఎస్ కి చెందిన మహదేవ్ దగిల్ వయస్సు 28 సం.లు, తన అక్కలని, అమ్మని గురించి నానా బూతులు తిట్టినాడు అని, తర్వాత పడుకున్న మహదేవ్ ని కాలితో తన్ని నాడు అని, తన వీపుపై ఇష్టం వచ్చినట్లు కొట్టినాడు అన్ని మహదేవ్ మీద కోపంతో అతన్ని చంపియాలని ఉద్దేశ్యంతో ఆ రూమ్ లో ప్రక్కనే ఉన్న చపాతీ కర్రతో మహదేవ్ నెత్తి మీద బలంగా ముద్దాయి కొట్టాడని,చపాతీ కర్ర విరిగిపోవడంతో ఆ పక్కనే ఉన్న లావుపాటి చెక్క కర్రతో మహాదేసి మెడ పై రెండు సార్లు బలంగా కొట్టాడని,దెబ్బలకి మహాదేవ్ అక్కడే క్రింద కూర్చొని ఒక ప్రక్కకి వాలిపోయాడని,

ఆ తర్వాత మహదేవ్ కాళ్ళు పట్టుకుని రూమ్ నుండి కొంత దూరం ఇడ్చుకుంటూ వెళ్లి, అక్కడకి దగ్గరలో గల పొదల మొక్కల వరకు తీసుకొని వెళ్లి అక్కడ వదిలి రూమ్ కి వచ్చి తన బ్యాగ్ తీసుకొని గేటు ద్వారా శ్రీ కృష్ణ యార్డ్ నుండి పరారయ్యాడని పోలీసు తెలిపారు.ముద్దాయి ని జూన్ 25వ తేదీ 2025 న సాయంత్రం 06.00 గంటలకు పెదగంట్యాడ ఆటోనగర్, వెంకన్నపాలెం ఇంక్షన్ వద్ద అరెస్ట్ చేశామని,.

ముద్దాయి పేరు నరేష్ కశ్యప్, తండ్రీ పీడు: లద్యణ్ కశ్యప్ లేట్, వయస్సు 30 సం.లు, కుం కశ్యప్, నివాసం: నియానార్ గ్రామము, జగదల్ పూర్ తాలూకా, బస్తార్ జిల్లా, ఛత్తీస్ ఘడ్ పిన్-494001 ప్రాంతానికి చెందినవాడని చనిపోయిన వ్యక్తి పేరు మహదేవ్ భగల్, తండ్రి పేరు: బలరాం, వయస్సు 28 సం.లు, ఎస్ టీ ఆదివాసీ, బిలోని గ్రామం, పర్పా %ూ%ప, జగదల్పూర్, చత్తీస్ గర్ రాష్ట్రం చెందినవాడని తెలిపారు.

## గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి సమీక్ష



**విశాఖ దక్షిణం,పెన్ పవర్, జూన్ 26 :** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి జులై 9న గిరి ప్రదక్షిణకు సంబంధించి జీవీఎంసీ ప్రజా ఆరోగ్య విభాగం చేయవలసిన ఏర్పాట్లపై జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ. ఎన్. వి. నరేష్ కుమార్ ప్రజా ఆరోగ్యపు అధికారు లతో గురువారం ఆయన చాంబర్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వైద్యా ధికారి మాట్లాడుతూ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణకు లక్షలాదిమంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని, అందుకు జీవీఎంసీ పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, దోమల నియంత్రణ మొదలైన వాటిపై తీసుకోవలసిన జాగ్రత్తలపై జీవీఎంసీ సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్వైజర్లు, పిఎంయు సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. భక్తులు నడిచే దారి పొడుగునా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసేందుకు ఒక రూట్ మ్యాప్ ను ఏర్పాటు ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాలలో పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలన్నారు. జీవీఎంసీ బయా లజిస్ట్ విభాగం అవసరమైనచోట్ల దోమల నివారణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

## మాదక ద్రవ్యాల వాడకం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం అవగాహనా ర్యాలీ






**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 26 :** ప్రపంచవ్యాప్తంగా జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వాడకం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించడం కొరకు పెదవాల్తేరు పోలమాంబ టెంపుల్ నుండి ఇ. ఎన్. టి. హాస్పిటల్ వరకు అవగాహనా ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలి ని డిఎం అండ్ హెచ్ ఓ, పి జగదీశ్వర్ రావు గారు జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభిం చారు. ఈ అవగాహన ర్యాలీలో నర్సింగ్ స్టూ డెంట్స్ మరియు కమ్యూనిటీ సభ్యులు పాల్గొ నడం జరిగింది. అనంతరం ప్రభుత్వ మానసిక ఆసుపత్రి మీటింగ్ హాల్ నందు అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమా వేశంలో డాక్టర్, రోణ%శీ%కి రమేష్, డి. ఎల్. ఏ. టి. ఓ. గారు మాట్లాడుతూ మాదకద్రవ్యా రహిత విశాఖపట్టణం జిల్లాగా తీర్చిదిద్దడంలో యువత తమ వంతు పాత్ర నిర్వహించవలసిందిగా పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వ్యసనం నుండి బయటపడుటకు ఓఎస్టీ మందులు ఏ విధంగా సహకరిస్తాయో తెలియజేయడం జరిగింది. అనంతరం ఎన్జీవో సిబ్బందికి జ్ఞాపికలు అందజేయడం జరిగింది. ఈ సమావే శంలో గోడ ప్రతులను ఆవిష్కరించే కార్యక్ర మంలో భాగంగా డాక్టర్ ఆర్ రమేష్ గారు, డి. ఎల్. ఏ. టి. ఓ., డాక్టర్ హరికృష్ణ, ప్రొఫెసర్ మెంటల్ హెల్త్ కేర్. డాక్టర్ హైమావతి, సి. ఎస్. ఆర్. ఎమ్. ఓ., డాక్టర్ శ్రవణ్ కుమార్ ఏ. ఆర్. టి. మెడికల్ ఆఫీసర్, డాక్టర్ శ్రీనివాసరావు ఓ. ఎస్. టి. మరియు శ్రీ డి. వీరభద్రరావు సమిద ప్రాజెక్ట్ డైరెక్టర్ సంయుక్తంగా గోడ ప్రతులను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం మత్తు మందుల వాడకం అక్రమ రవాణా పట్ల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎం ఉమామహేశ్వ రరావు జిల్లా ఐసీటీసీ సూపర్వైజర్ బద్రి . సమిద స్వచ్ఛంద సంస్థ సిబ్బంది మరియు వివిధ ఎన్జీవోలు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ప్రధాన పాత్ర వహించడం జరిగింది.

## బాలల ఆధార్ నమోదుపై ఎంపీడీఓ సమీక్షా సమావేశం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూన్ 26:**జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా పోలీసులతో పాటు అంగన్వాడీ సూపర్వైజర్లకు సంబంధించి ఒక సమీక్షా సమావేశం గురువారం గూడెం కొత్త వీధిలో నిర్వహించబడింది.ఈ సమావేశంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు డిప్యూటీ ఎంపీడీవో పాపారావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, “జీరో నుండి ఆరు సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పిల్లల్లో ఆధార్ కార్డు లేని వారిని వెంటనే బాలాదార్ ద్వారా నమోదు చేయాలి. ఇప్పటికే పుట్టిన సర్టిఫికెట్లు ఉన్న పిల్లలకు ప్రాసెస్‌ను వేగవంతంగా పూర్తి చేసి, వారిని సమీప సచివాలయంలో ఆధార్ చేయించాలి” అని తెలిపారు. అలాగే, అధిక హ్యాబిటేషన్‌ల చివరి భాగాల్లో నివసించే పిల్లలకు మరింత సులభతరం చేయడానికీ, ఆయా ప్రాంతాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. “పోషక అభియాన్ కింద పిల్లలకు పోషకాహారం ఇచ్చే సమయంలో ఆధార్ తప్పనిసరి అవుతోంది. కావున ఆధార్ లేని పిల్లలు మిగలకూడదు” అని వివరించారు.మరింతగా, మహిళా పోలీసులకు బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించే క్యాంపులు నిర్వహించాలని, గ్రామస్థాయిలో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ఉందని సూచించారు.

## నగర సుందరీకరణ పై ప్రత్యేక దృష్టి సారించాలని,



జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్ జూన్ 26:** నగరాభివృద్ధి, నగర సుందరీ కరణ పై దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశిం చారు.గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లోగల సమావేశ మందిరంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారుల తో ఇంజనీ రింగ్ విభాగం పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ మాట్లా డుతూ నగరాభివృద్ధి తో పాటు నగర సుందరీ కరణ పై దృష్టి సారించాలన్నారు. నగరంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షక ఇంజనీర్ల పరిధిలో జోన్ల వారీగా మొత్తంగా చేపట్టిన పనులు,ప్రధాన పనులు, ఎంత మొత్తం నిధులతో నిధులతో చేపట్టారు ?ఎన్ని పనులు పూర్తయినవి,జరుగుచున్నవి, పూర్తి కావాల్సి నవి , తదితర విషయాలపై పర్యవేక్షక ఇంజ నీర్లతో సమీక్షించి, పూర్తయిన పనులతో పాటు వాటి నిధుల వివరాలను అడిగి తెలుసుకొని, చేపట్టిన ,చేపట్టబోవు పలు ప్రాజెక్టులపై సమీక్షించారు.అన్ని జోన్లలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని పర్యవేక్షక ఇంజనీర్లను కమిషనర్ ఆదేశించారు. అనంతరం మధురవాడ లో చేపట్టబోవు భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ కు సంబంధించిన ప్రాజెక్టు పనులపై ఇంటర్నేషనల్ ఫైనాన్సు కార్పొరేషన్ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్షించారు.నగరంలో అన్ని జోన్లలో చేపట్టిన బీటీ రోడ్లు, సిసి రోడ్లు, కాలువలు, తాగునీటి పైప్లైన్లు, వీధి దీపాల కొరకు భూగర్భ కేబుల్ పనులు, మెకానికల్ , గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్, స్వీపింగ్ మిషన్ , విద్యుత్ దీపాల నిర్వహణ , భూగర్భ మురుగునీటి కాలువల పనులు మొదలైన వాటి పనుల వివరాలను పర్యవేక్షక ఇంజనీర్లు కమిషనర్ కు వివరించారు. సింహాచలం గిరి ప్రదక్షిణ మార్గంలో , బీచ్ నుండి ఎండాడ కు అనుసంధాన మార్గంలో, అనకాపల్లి పెరుగు బజార్ మార్గంలో రోడ్డు పనులు, పలుచోట్ల మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు,తగరపువలస, చిల్లపేట వద్ద పైప్ లైన్ పనులు తదితర పూర్తి చేయవలసిన పనుల వివరాలను కార్యని ర్వాహక ఇంజనీర్లు కమిషనర్ కు వివరించారు .

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పూర్తి కావాల్సిన ఆయా పనులను వెంటనే పూర్తి చేసేలా గుత్తేదారులకు ఆదేశించాలని, టెండర్లు పూర్తయిన వెంటనే సంబంధిత గుత్తేదారులు కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రకారం నిర్ణీత కాలంలో పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని, ఆయా పనులలో వార్డు ఎమినిటీ కార్యదర్శుల ను భాగస్వామ్యం చేయాలని , నగర సుందరీకరణ పై ప్రత్యేక దృష్టి సారించాలని, విశాఖ ఎయిర్ పోర్ట్ నుండి వీఐపీ రోడ్డు వరకు సెంటర్ మీడియన్ లలో పచ్చదనం, పెయింటిం గ్ , రోడ్లపై జీబ్రా క్రాసింగ్ ,కూడళ్ళ వద్ద పెయిం టింగ్ పనులకు అంచనాలు తయారు చేయా లని పర్యవేక్షక ఇంజనీర్లను కమిషనర్ ఆదేశిం చారు.

ఈ సమీక్ష సమావేశంలో పర్యవేక్షక ఇంజనీర్లు గోవిందరావు, కె వి ఎన్ రవి, పి.వి.వి సత్య నారాయణ రాజు, సంపత్ కుమార్, కె.శ్రీనివా సరావు, వై.కృష్ణారావు, అందరు కార్యనిర్వా హక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



## ‘నషా ముక్త్ భారత్’ అవగాహన ర్యాలీ






**గుమ్మలక్ష్మీపురంలో జూన్ 26. పెన్ పవర్.**ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో పలు కళాశాలల విద్యార్థులతో గురువారం ‘నషా ముక్త్ భారత్’పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,వాటిని అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆయన అన్నారు.మరియు ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువగా యువత మత్తు పదార్థాలకు బానిసవుతున్నారని వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి ఎమ్మార్వో: శేఖర్.ఎంఈఓ.ఉపాధ్యాయు లు.పోలీస్,సిబంది.రెవెన్యూ, వైద్య సిబ్బంది మరియు సచివాలయ.ఐ.సి.డి.ఎస్.సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వార్డ్ అభివృద్ధికి కృషి చేస్తూన్న టిడిపి ప్రభుత్వం

- వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం



**గాజువాక: పెన్ పవర్,జూన్ 26 :**వార్డ్ అభివృద్ధికే కృషి చేస్తా వార్డు లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం అన్నారు. ఈ సందర్భంగా వార్డులో వడ్లపూడిలో ప్లహరి, లక్ష్మీపురం లో సిసి రోడ్డు మరియు సంతమామిడి తోటలో ఓపెన్ షెడ్ నిర్మాణాలపై సుమారు అరవై లక్షల రూపాయలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ వార్డ్ అభివృద్ధికె కృషి చేస్తానని, దిన దిన అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో అభివృద్ధి పరంగా మన వార్డును మొదటి స్థానంలో నిలబెట్టే విధంగా కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు సాగి విజయరామరాజు, మాజీ హాస్పిటల్ కమిటీ చైర్మన్ రాజన్న రాజు, బిజెపి కో కన్వీనర్ లక్కరాజు సోమరాజు, జనసేన వార్డు అధ్యక్షులు శిరసపల్లి కనకరాజు,టీడీపీ సెక్రటరీ శిరసపల్లి బాబురావు, ఎస్. బాబురావు, జి. రాంబాబు,కె. నరసింగరావు, బోండా లక్ష్మి,వడ్లపూడి గ్రామ పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్ తో మర్యాదపూర్వకంగా జీవీఎంసీ కమిషనర్ భేటీ



**విశాఖ దక్షిణం పెన్ పవర్ జూన్ 26 :** విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి ను మర్యాదపూ ర్వకంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విశాఖ పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్ లో గురువారం కలిసి పూల మొక్కను అందించా రు. ఈ సందర్భంగా వారిరువురూ జీవీఎంసీ అభివృద్ధిలో భాగంగా లా అండ్ ఆర్డర్ , ట్రాఫిక్ తదితర సమస్యలపై పరస్పరం చర్చించుకున్నారు.

## జనసేన బలోపేతమే అందరి లక్ష్యం కావాలి.....

జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ఛార్జ్ సూర్యచంద్ర......



**నాతవరం పెన్ పవర్ (జూన్ 26):** జనసేన పార్టీ బలోపేతమే అందరి లక్ష్యం కావాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు.గురువారం నాతవరంలో జనసేన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సూర్యచంద్ర మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయాలు, ఆశయాల మేరకే ప్రతీ ఒక్క జనసైనికులు నడుచుకోని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలను అనుగుణంగా పని చేసిన వారికి తగిన స్థానం. గుర్తింపు ఎప్పుడు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రాష్ట్రం అభివృద్ధి వైపు దూసుకుపోతుందన్నారు. ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని నిరంతరం పరితపించే వ్యక్తి జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సుపరిపాలనను చూసి నేడు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాలు అందిస్తుండటంతో రాష్ట్రం అన్ని రంగాల్లో సమిష్టి అభివృద్ధి సాధిస్తూ స్వర్ణాంధ్ర 2047 సాధించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరాశాఖ, పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. భవిష్యత్ మరెన్ని కార్యక్రమాలతో రాష్ట్రం సుభీక్షంగా ఉంటుందన్నారు. జనసైనికులు అందరూ కలిసిమెలిసి ఉండి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జనసేన పార్టీ బలోపేతమే ధ్యేయంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, జిల్లా సెక్రటరీ పంచాద హరినాధ్,నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ,జనసేన మండల నాయకులు పోలుపర్తి శ్రీనివాస్,పంచాద ఆసిన్ కుమార్,శేఖర్,మాకిరెడ్డి వెంకటరమణ,అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గన్నారు.


## గంజాయి పట్టివేత, నిందితుడు అరెస్ట్



**కొయ్యూరు, పెన్ పవర్,జూన్ 26:**గురువారం రూ. 1,91,875 విలువగల 38.375 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకొని నిందితుడిని అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి మంప ఎస్సై, కొయ్యూరు ఇన్చార్జి ఎస్ఐ కె. శంకరరావు వారికి గంజాయి రవాణా గురించి వచ్చిన సమాచారంపై గురువారం మధ్యాహ్నం మండలంలోని చీడిపాలెం జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా జిల్లా లోని గూడెం కొత్త వీధి మండలం, రంపుల గ్రామానికి చెందిన గొల్లోరి బొంజిబాబు అనే వ్యక్తి అన్నవరం నుండి 38.375 కేజీల గంజాయిని స్కూటీ మీద నర్సీపట్నంకు తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీనితో గంజాయి కలిగిన స్కూటీతో సహా నిందితున్ని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఈ గంజాయి విలువ రూ. 1,91,875 లు ఉంటుందని ఎస్ఐ శంకర్రావు తెలిపారు.

## పలు సమస్యలపై ముఖ్యమంత్రిను కలిసిన ప్రభుత్వ విప్.

కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం జూన్ 26. పెన్ పవర్.** విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను గురువారం నాడు కలిసి నియోజకవర్గంలో పలు సమస్యల పై ముఖ్యమంత్రికు వివరించారు. నియోజకవర్గంలో ప్రధానంగా ఏనుగులు సమస్యను పరిష్కరించాలని, కురుపాంలో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి నిధులు విడుదల,చేయాలని. ముఖ్యంగా గిరిజనులకు సంబంధించి జీవో నెంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయ జీవోను తీసుకువచ్చేలా కృషి చెయ్యాలని ఆమె అన్నారు.తోటపల్లి, గుమ్మిడిగెడ్డ,ఒట్టిగెడ్డ,జంఝావతి ప్రాజెక్టు గురించి మరియు నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లానని ఎమ్మెల్యే అన్నారు.

# వీధి విక్రయదారుల నగర కమిటీ

- అనధికారుల సభ్యత్వానికి దరఖాస్తులు స్వీకరణ
- 3వ జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 26 :** వీధి విక్రయ దారుల నగర కమిటీ అనధికారుల సభ్యత్వం కొరకు దరఖాస్తులను ఆహ్వానించ డమైనదని జోన్- 3 జోనల్ కమిషనర్ కె.శివప్ర సాద్ సోమవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.వీధి విక్రయదారుల చట్టం 2014 జీవో నెంబర్ 137 ప్రకారం మహా విశాఖపట్నం నగర పాలక సంస్థలో వీధివిక్రయ దారుల నగర కమిటీలో నలుగురు అనధికార సభ్యులను వివిధ వ్యాపార వృత్తికి చెందినవారు మరియు నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ (ఎన్జీవోస్%ం%)-1, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ (సి బి ఓ-1) ఎంపిక/నామినేషన్ విధానం ద్వారా 3 సంవత్సరాల కాల పరిమితి గల కమిటీని ఎంపిక చేయుటకు స్ట్రీట్ వెండర్ అసోసియే షన్స్, మార్కెట్ అండ్ ట్రేడ్ అసోసియేషన్, రిజిస్టర్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ లైక్ టౌన్ లెవెల్ ఫెడరేషన్ లీడర్, నివాసిత సంక్షేమ సంఘం నుంచి దరఖాస్తులు ఆహ్వానించడమైనదని, ఈ దరఖాస్తులను నోటిఫికేషన్ ఇచ్చిన 07 రోజులలో రిజిస్టర్ పోస్టు ద్వారా గాని నేరుగా యు సి డి విభాగం 3వ జోన్ అశీలమెట్ట జీవీఎంసీ కార్యాలయము నందు గల డ్రాఫ్ట్ బాక్స్ లో తేదీ జూన్ 27, 2025 నుండి జూలై 02, 2025 సాయంత్రం 5 గంటలు లోగా దాఖలు చేయవలెనన్నారు.దరఖాస్తు నమూనా ఇతర వివరాలు జీవీఎంసీ 3వ జోన్ కార్యాల యంలో పొందవచ్చు అన్నారు. పూర్తి వివరా లకు కార్యాలయం పని దినాలలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ (యు.సి.డి) ఎల్.రాము ను సంప్రదిం చగలరని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

## మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా న్యూడెమోక్రసీ



- నేడు దేశంలో అనధికారిక ఎమర్జెన్సీ అమలు.
- మోడీ ప్రభుత్వాన్ని కార్పొరేట్లు శాసిస్తున్నారు.
- సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి ప్రసాద్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 26 :**ఆనాటి ఎమర్జెన్సీని ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రకటిస్తే, నేడు దేశంలో అనధికారికంగా ఎమ ర్జెన్సీ అమలు చేస్తున్నారని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి ప్రసాద్ తెలిపారు. ఎమర్జెన్సీ డే సందర్భంగా మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా న్యూడెమోక్రసీ విశాఖ, విజయ నగరం జిల్లాల ఏరియా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో గురువారం సభ జరిగింది.

ముఖ్య వక్తగా విచ్చేసిన పి ప్రసాద్ ప్రసంగిస్తూ దేశంలో ఏం జరిగినా ముస్లింలే కారణమని పాలకులు ప్రచారం చేస్తున్నారన్నారు. నేడు రాజకీయ నియతృత్వంతో పాటు సాంస్కృతిక ఆర్ ఎస్ ఎస్ ఆర్మీ ఉందని, ఆనాడు హిట్లర్ కి ప్రైవేట్ ఆర్మీ లాగా నేడు అది తయారయిం దన్నారు.అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్ ముఠా నేడు మోడీని శాసిస్తుందని తెలిపారు. ఆర్ ఎస్ ఎస్, కార్పొరేట్ శక్తులు కలిసి దేశాన్ని తమ గుప్పిట్లో పెట్టు కోవడంతో దేశం అంధకా రంలోకి వెళ్తుందన్నారు. ఆదివాసీలను దళితు లను ముస్లింలను మైనార్టీలను శత్రువులుగా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పు దోవ పట్టించి వారిపై రెచ్చగొట్టే విధంగా ప్రమాదకర ఎజెండాను బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. కాశ్మీర్ లో జరిగే నరమేధాన్ని కూడా బయటికి తెలియనీ యడం లేదన్నారు. నాటి ఎమర్జెన్సీలో లక్ష 70 వేల మంది అరెస్టు కాగా, 19 వేల మందిని జైల్లో నిర్బంధించారని గుర్తు చేశారు. గాజాలో అమా నుష హత్యకాండ జరుగుతున్న ప్రపంచం కళ్ళు మూసుకొని ఉందని తెలిపారు. హిట్లర్ నాటి పరిస్థితులు నేడు తిరిగి వస్తున్నాయన్నారు. మోడీని బిజెపి, దానిని ఆర్ఎస్ఎస్ నడుపు తుండగా, కార్పొరేట్ వర్గాలు వీటిని పోషిస్తున్నా యన్నారు. మహారాష్ట్రలోని మక్కా మసీదులో, హైదరాబాదులోని బాంబు పేలుళ్లు వెనక ఆర్ఎస్ఎస్ హస్తం ఉందని అప్పటి కమిషన్ బయటపెట్టిందని గుర్తు చేశారు. ఎక్కడా ఉగ్రవాదులు మతం అడిగి చంపరని, కానీ పహాల్గంలో దాడి చేసినవారు అలా అడగడం, ఆ నలుగురు పట్టుబడకపోవడం వెనుక ఎవరు హస్తం ఉందో అర్థం చేసుకోవాలని చెప్పారు. బలవంతంగా రుద్దుతున్న త్రిభాషా విధానాన్ని తమిళనాడు వ్యతిరేకించిందని దాన్ని తప్పు పట్టారని, కానీ మహారాష్ట్రలోని బిజెపి ప్రభుత్వమే వ్యతిరేకించడంతో గత్యంతరం లేక వెనుకకు తగ్గారని తెలిపారు. జీఎస్టీ పేరుతో రాష్ట్రాలపై భారాలు వేసి పెత్తనం చేస్తున్నార న్నారు. గాజా నుండి గుజరాత్ వరకు మారణ కాండ జరుగుతుందని, కగార్ పేరుతో కేంద్రం హత్యలు చేస్తుందన్నారు. ఆధ్యాత్మిక రాము డుని, నేడు రాజకీయ రాముడుగా మార్చారని తెలిపారు. సత్యాలు రాయకపోవడం, వక్రీకరణ తో అసత్యాలు ప్రచురించడం, మీడియాలో జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ప్రస్తుత అనధికార ఎమర్జెన్సీ చాలా ప్రమాదం.మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వీ ఎస్ కృష్ణ గతంలోని ఎమర్జెన్సీ కన్నా ప్రస్తుత అనధికార ఎమర్జెన్సీ చాలా ప్రమాదమని

మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వీ ఎస్ కృష్ణ అన్నారు. సభలో మరో ముఖ్య వక్తగా ఆయన మాట్లాడుతూ

ప్రస్తుతం గాజాలో 20 లక్షల మంది పిల్లలు తిండి లేక అల్లాడిపోతున్నారని, ఐదు కిలోమీ టర్ల దూరంలోనే ఆహారం ఉన్నా, వారికి అందడం లేదన్నారు. ఈ పరిస్థితి 21నెలలుగా గాజాలో నడుస్తుందన్నారు. గాజాలో సీజ్ ఫైర్ ట్రంప్ ఎందుకు ప్రకటించలేదన్నారు. ఇజ్రాయిల్ అమెరికా వద్ద అణు బాంబులు ఉన్నాయని, 2సార్లు అణు బాంబులను వాడిందన్నారు. రాజ్యాంగాన్ని ఎమర్జెన్సీలో పాతర వేశారని బిజెపి చెప్తుందని, అధికారంలోకి వచ్చాక మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తుందని తెలిపారు. పైగా దేశ సంపదను కార్పొరేట్స్ కు అప్పగించి, ప్రభుత్వంలోని అన్ని వ్యవస్థలను తనకు అనుకూలంగా మార్చుకుందని విమర్శించారు. అప్పటి ఎమర్జెన్సీకి కార్పొరేట్స్ మద్దతు లేదని, నేటి అనధికారిక ఎమర్జెన్సీకి వారి మద్దతు ఉందని తెలిపారు. మీడియా పూర్తిగా కార్పొరేట్స్ చేతిలోకి వెళ్లిపోయిందన్నా రు. ఎన్కౌంటర్లపై ఆరోపణలు వచ్చినప్పుడు సుమోటోగా పోలీసులపై కేసు నమోదు చేయాల్సి ఉందన్నారు. బుద్ధుడు చార్వాకులు కాలం నుండి నేటి వరకు సమానత్వం కోసం ఉద్యమాలు సాగుతున్నాయని తెలిపారు.

అప్పటి జాతీయ ఎమర్జెన్సీ ఒక చీకటి కోణం. భానాస రాష్ట్ర అధ్యక్షులు టీ శ్రీరామ్మూర్తి

భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టీ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలను పరిష్కరించకుండా అణిచివేత పద్ధతిని ప్రభుత్వాలు అనుసరిస్తు న్నాయని తెలిపారు. అప్పటి జాతీయ ఎమర్జె న్సీ ఒక చీకటి కోణం అన్నారు. ప్రాథమిక హక్కుల ఉల్లంఘనతో పాటు వేలమందిని జైల్లో పెట్టి, వందలాది మందిని చంపారని తెలిపారు. అప్పట్లో ఆరేళ్లుగా పోటీ చేయకూడదు పాలిం చకూడదని హైకోర్టు తీర్పించిందని, సుప్రీంకోర్టు దీనిని సమర్థించిందని, దీని నుంచి బయటపడ డానికి ఎమర్జెన్సీని ఇందిరాగాంధీ విధించిందని గుర్తు చేశారు. కార్మికుల వేతనాలు తగ్గించారని, ప్రశ్నించే వారిపై అణిచివేత కొనసాగించారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల హక్కులను కాల రాశారన్నారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ ఓడిపోయిందని, జనతా పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. 2014 నుండి 11 ఏళ్లలో దేశంలో అనధికారక ఎమర్జెన్సీ కొనసాగుతుందన్నారు. ప్రజల సమస్యలపై, మైనింగ్ తవ్వకాలపై ఉద్యమిస్తున్న 550 మంది ఆదివాసీలు, మావోయిస్టులను చంపారన్నారు. ఇక్కడి ఏజెన్సీలో ప్రజల వ్యతిరేకతతో బాక్సైట్ తవ్వకాలు గతంలో ఆగాయని, ఇప్పుడు బిజెపి కేంద్ర ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలపై మార్గం సుగమం చేశారని, ఫలితంగా రెండు లక్షల మంది గిరిజనులు ఉపాధి గూడు కోల్పోతారని, పర్యావరణం దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ప్రతినిధి కె పద్మ మాట్లాడుతూ ఎమర్జెన్సీలో జరిగిన చరిత్ర నేడు పునరావృత్తం అవుతుం దన్నారు. ఎన్కౌంటర్ పై కోర్టులో కేసులు వేస్తే కోర్టుకు హాజరుకావాలని సంబంధిత పోలీసు లకు ఆదేశాలిచ్చిన చట్టంలోని లోసుగులతో హాజరు కాలేదని గుర్తు చేశారు. జైళ్ళల్లో అనేక మంది అమాయకులు మగ్గుతున్నారని, న్యాయ వ్యవస్థ పూర్తిగా నీరుగారి పోయిందన్నారు. నేరమే అధికారమై, నేరస్తులు దేశాన్ని పాలిస్తు న్నారన్నారు.సిపిఐ(యం.యల్) న్యూడెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ కార్యదర్శి యం. వెంకటేశ్వర్లు సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎమర్జెన్సీ విధించి 50 ఏళు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఫాసిస్టు వ్యతిరేక రాజకీయ ప్రచార సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాసి మనువాదాన్ని అమలు చేస్తున్నదని తెలిపారు. అనధికారిక చట్టాలు ద్వారా మేధావులను ప్రజాస్వామ్యవాదులను జైల్లో పెడుతున్నారని విమర్శించారు. గత 11 సంవత్సరాలుగా ఇదే విధానాన్ని మోడీ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. మతపరమైన పరిపాలన తీసుకువచ్చి ప్రజలని విభజిస్తుందని ఆరోపించారు. ఆపరేషన్ కగారు పేరుతో ఆదివాసులను మావోయిస్టులను చంపుతూ అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టి కుట్ర బిజెపి ప్రభుత్వం చేస్తుందని ప్రజల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సభలో వివిధ ప్రజాసంఘాల నేతలు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుల బృందం పాడిన పాటలు సభికులను ఉత్తేజపరిచాయి.

## జర్రెల పీహెచ్‌సీ అంబులెన్స్ రెండు నెలలుగా నిలిపివేత - ఎమర్జెన్సీ కేసులకు తీవ్ర ఇబ్బంది



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 26:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఉపయోగంలో ఉన్న ఏకైక అంబులెన్స్ గత రెండు నెలలుగా పని చేయకపోవడంతో స్థానికంగా ఎమర్జెన్సీ సేవలు తీవ్రంగా ప్రభావిత మవుతున్నాయి. అంబులెన్స్ రిపేర్‌కు పంపించకుండా చేసి ఉంచడంతో, హాస్పిటల్‌కి వచ్చే అత్యవసర రోగులను సమీపంలోని పెద్ద ఆసుపత్రులకు తరలించడంలో వైద్య సిబ్బంది తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రత్యేకించి రాత్రి సమయంలో ఎమర్జెన్సీ కేసులు వచ్చినప్పుడు 108 అంబులెన్స్ సేవలపై మాత్రమే ఆధారపడాల్సి వస్తోంది. అయితే, 108 అంబులెన్స్ అందుబాటులోకి రావడం ఆలస్యం కావడంతో కొన్ని సందర్భాల్లో రోగుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.ఈ నేపథ్యంలో జర్రెల ప్రాంతానికి చెందిన మొండిగడ్డ, వంచుల, అమ్మవారి దారకొండ పంచాయతీల ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు అడపా సత్తిబాబు మాట్లాడుతూ, "అంబులెన్స్ లేని పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యానికి పెను ముప్పుగా మారింది. వెంటనే జిల్లా కలెక్టర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ స్పందించి, జర్రెల పీహెచ్‌సీ అంబులెన్స్‌ను మరమ్మతు చేసి తిరిగి సేవలోకి తీసుకురావాలి" అని కోరారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యకు సంబంధించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## కన్నుల పండుగగా శ్రీ జగన్నాథ స్వామివారి శాంతి కల్యాణం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 26 :** టౌన్ కొత్త రోడ్డులోని శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్స వాల సందర్భంగా లోక కళ్యాణార్థం బలబద్ర, సుభద్ర సమేత శ్రీ జగన్నాథ స్వామి వారికి వైఖానస ఆగమ సాంప్ర దాయంలో శాంతి కళ్యాణం ఘనంగా జరిగింది మంగళ వాయి ద్యాలు, వేద మంత్ర ములతో ఆలయ అర్చకు లు రంగనాథ ఆచార్యులు, జగన్నాథ చార్యు లు, వేడుకగా శ్రీ జగన్నాథ స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వ హించారు స్వామివారి కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదము లు అందజేశారు.

ఈ కార్యక్రమం లో ఆలయ ఈవో టి రాజ గోపాలరెడ్డి ప్రముఖ ఆధ్యాత్మి కవేత్త ఎంవీ రాజశేఖర్ ఆలయ సిబ్బంది ప్రసాద్, సిహెచ్ శ్రీరామ్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాకాలంలో విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజలకు సూచించిన జనసేన నాయకుడు ఇమ్మానుయేల్ (సిద్దు)

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 26:**అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం పొంచి ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనసేన పార్టీ జీకే వీధి మండల సోషల్ మీడియా ఐటీ ఇంచార్జ్, రింతాడ పంచాయతీ అధ్యక్షుడు కొయ్యం ఇమ్మానుయేల్ (సిద్దు) హెచ్చరించారు. వర్షాకాలంలో నిల్వ నీరు దోమల పెరుగుదలకు దోహదపడుతుందని, దీని వల్ల విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి, నిర్జలాభారిత ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి, అలాగే దోమతెరలు, దోమలు తరిమే స్ప్రేలు వాడాలని ప్రజలకు సూచించారు.విష జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.నిల్వ నీటి ప్రాంతాలు తొలగించాలి.తాగునీరు శుద్ధి చేయాలి, కలుషిత నీరు తాగకూడదు.పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగి తినాలి.తగినంత విశ్రాంతి తీసుకోవాలి.ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలి.జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలి. సమాజంలో ఎవ్వరైనా జ్వరాలతో బాధపడుతుంటే, వారిని ఆశ వర్కర్ల సాయంతో ఆసుపత్రికి తీసుకెళ్లే బాధ్యత ప్రతి పౌరుడి పై ఉందని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించితేనే మహమ్మారి స్థాయికి వెళ్లే ప్రమాదం నుండి మనల్ని మనం కాపాడుకోగలమని కొయ్యం ఇమ్మానుయేల్ (సిద్దు) ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# కుటుంబాల చేత అవయవ దానం చేసేలా అవగాహన కల్పించాలని

- అవయవ దానం కోసం అవగాహన కల్పించడం పై ప్రత్యేక దృష్టి సారించాలి
- ప్రతి ఆసుపత్రిలో అవయవ దానం బోర్డులు, కోఆర్డినేటర్లను ఏర్పాటు చేసుకోవాలి
- రాష్ట్ర జీవన్ దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ కే రాంబాబు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 26 :** అవయవ దానం చేయటం కోసం ప్రజలను ప్రోత్సహించేందుకు అవగాహన కల్పించడంపై ప్రతి ఒక్కరు ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవన దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ కే రాంబాబు సూచించారు. గురువారం విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నందు జీవన్ దాన్ ఈస్ట్ జోన్ జిల్లాల ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జీవన్ దాన్ కింద 73 ఆసుపత్రులు నమోదు చేసుకున్నారు అయితే వాటిలో 50 శాతం ఆస్పత్రుల్లో కూడా ఒక్క బ్రెయిన్ డెడ్ కేసు కూడా ప్రకటించకపోవడం ఆలోచించవలసిన అంశం అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్ కేసులు వస్తున్నప్ప టికీ వాటిని ప్రకటించడంలో వైద్యులు ఆసక్తి చూపించడం లేదన్నారు. దీనికి గల కారణం బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాల స్వీకరించటంలో రోగి బంధువులకు సరైన అవగాహన కల్పించకపోవడం అవయవాలను రోగి శరీరం నుంచి తీయటంలో వైద్య బృందం అందుబాటులో లేకపోవటమే కారణమన్నారు.. ఈ సమస్యను పరిష్కరించేందుకుగాను ప్రతి ఆసుపత్రిలో అవయవ దానం పై అవగాహన కల్పిస్తూ బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.. అవయవాలు స్వీకరించేందుకు వైద్య బృందం లేకపోయినా బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించి తమ దృష్టికి తీసుకుని వస్తే అవయవాలు స్వీకరించేందుకు వైద్య బృందాన్ని పంపిస్తామని తెలిపారు. అతి తక్కువ విభాగాలతో ఉన్న విమ్స్ ఆస్పత్రి నందు మూడు బ్రెయిన్ డెడ్ కేసులను ప్రకటించి అవయవాలను స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించామన్నారు.. విమ్స్ ఆస్పత్రి స్ఫూర్తితో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా బ్రెయిన్ డెడ్ రోగులను ప్రకటించి వారి కుటుంబాల చేత అవయవ దానం చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు.. అవయవ దానం చేసే రోగికి రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించటంతో పాటు పదివేల రూపాయలు అంత్యక్రియ ఖర్చులు నిమిత్తం ఇస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవయవ దానంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కూడా తమ వంతు బాధ్యతగా అవయవ దానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు ప్రతి ఒక్క ఆసుపత్రిలో అవయవ దానం కోసం కోఆర్డినేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.. తద్వారా అవయవాలు దానం చేసేందుకు బ్రెయిన్ డెడ్ అయిన రోగి బంధువులు ఆసక్తి చూపిస్తారని అవయవాల అవసరమైన వారికి నూతన వెలుగులు నింపేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమం ఒక మానవతా దృక్పథం సేవా దృక్పథంతో ఆలోచిస్తే విజయవంతం అవ్వటం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల అధికారులకు ఉన్న సందేహాలు నివృత్తి చేయడంతో పాటు వారు తెలిపిన సలహాలు సూచనలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లడం జరుగుతుందన్నారు..

# లబడపుట్టులో నేటికి తెరుచుకోని పాఠశాల

- ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు.
- పాఠశాలలో ఉపాధ్యాయుని నియమించాలని, పాఠశాల భవనం నిర్మాణం చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 26.** ఉపాధ్యాయులు లేని కారణంగా ఆ పాఠశాల ఈ విద్యాసంవత్సరంలో పాఠశాల ప్రారంభం నుండి నేటి వరకు తెరుచుకోలేదు. పాఠశాలలో ఉపాధ్యాయుడు రాకపోవడంతో తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గల మాకవరం పంచాయతీ, లబడపుట్టు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఈ విద్య సంవత్సరం ప్రారంభం నుండి ఇప్పటివరకు ఉపాధ్యాయులు లేక తెరుచుకోలేదని, దీంతో పాఠశాలలో చదివే 30 మంది విద్యార్థులు చదువుకు దూరం అయ్యే పరిస్థితి నెలకొందని పాఠశాల విద్య కమిటీ చైర్మన్ అడికట్టియ శ్యామలరావు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ.. పాఠశాల ప్రారంభం నుండి ఇప్పటివరకు సంబంధిత అధికారులు తమ పాఠశాల వైపు కన్నెత్తి చూడలేదని, గతంలో పనిచేసిన ఉపాధ్యాయుడు మరణించడంతో విద్యా వాలంటరీ ద్వారా తమ పాఠశాల కొనసాగిందని అన్నారు. ఈ విద్య సంవత్సరం ప్రారంభము నుండి నేటి వరకు విద్య వాలంటీరునిగాని ఉపాధ్యాయుని గాని తమ గ్రామంలో నియమించకపోవడంతో తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల భవనం కూడా తమ గ్రామంలో లేవని, పాకలోనే విద్యా బోధన గతం నుంచి జరుగుతుందన్నారు. అనేకమార్లు అధికారుల దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ప్రతిరోజు తమ పిల్లలు ఉపాధ్యాయుని కోసం ఎదురు చూస్తున్నారని, సంబంధిత అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామంలో ఉపాధ్యాయుని నియమించాలని, పాఠశాల భవనం నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడికటియ రాజేంద్ర, మండి మంగ్రాజ్, కొర్ర సాయికుమార్, పాంగి సురేష్, కొర్ర మహేష్, వంతాల ధనేష్ తదితరులు పాల్గొన్నారు.

# మే-2025 నెలలో రికవరీ మేళా






**వివిధ ఆస్తి నేరాల విభాగాల కింద మొత్తం 82 ఆస్తి నేరాల కేసులు**

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 26 :** విశాఖపట్నం నగరంలో వివిధ ఆస్తి నేరాల విభాగాల కింద మొత్తం 82 ఆస్తి నేరాల కేసులు నమోదయ్యాయి. దీనికి సంబంధించి, విశాఖ పట్నం మెట్రోపాలిటన్ నగరానికి చెందిన పోలీస్ కమిషనర్ కమ్ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ సూచనల మేరకు, ప్రత్యేక బృందాలు ఏర్పడ్డాయి మరియు బృందాలు సాంకేతిక పద్ధతులను ఉపయోగించాయి, అన్ని కోణాల నుండి కేసులను దర్యాప్తు చేశాయి, పోలీస్ కమిషనర్ సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో మరియు డీసీపీ (క్రైమ్స్) పర్యవేక్షణలో మే-2025 నెలలో 70 కేసులను గుర్తించాయి, వివిధ విభాగాల కింద 65 మంది నేరస్థులను అరెస్టు చేశాయి మరియు రూ.47,97,450/- విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నాయి. పైన పేర్కొన్న ఆస్తితో పాటు, రూ.57,00,000/- విలువైన 380 తప్పిపోయిన మొబైల్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.1,04,97,450/- విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. గుర్తించబడిన 70 కేసుల్లో, 2 మర్డర్ ఆఫ్ గెయిన్ కేసులు, 4 దోపిడీ కేసులు, 1 హెచ్‌బి బై డే కేసు, 11 హెచ్‌బి బై నైట్ కేసులు, 8 స్నాచింగ్ కేసులు, 14 మోటార్ సైకిల్ దొంగతనాలు, %×% కారు దొంగతనం కేసు, 1 జెసిబి దొంగతనం కేసు మరియు మిగిలిన 28 సాధారణ దొంగతనాలు కేసులు కనుగొనబడ్డాయి. స్వాధీనం చేసుకున్న ఆస్తి వివరాలు వస్తువులు గుర్తించబడిన కేసుల సంఖ్య నేరస్థుల సంఖ్య రికవరీ చేయబడింది 70 65 క్రమ సంఖ్య 1. 2. 3. బంగారం 4. వెండి 1044.385 గ్రాములు (1.04 కిలోలు) 6066.08 గ్రాములు (6.06 కిలోలు) 5. నగదు రూ.9,06,900/- 6. మోటార్ సైకిళ్ళు 14 7. మొబైల్ ఫోన్లు 395 (15 దొంగిలించబడిన మొబైల్ ఫోన్లు) (380 తప్పిపోయిన మొబైల్ ఫోన్లు) 8. జెసిబి 9. కారు 10. 1 1 1 11. ల్యాప్‌టాప్‌లు %జజ% కెమెరాల పరికరాలు (%జజ% కెమెరాలు, మానిటర్ మరియు హార్డ్ డిస్క్) మొత్తం ఆస్తి విలువ 1 మొత్తం రూ. 1,04,97,450/- (కేసు ఆస్తి రూ. 47,97,450/-) (తప్పిపోయిన మొబైల్‌లు రూ. 57,00,000/-) బృందాల కృషి, 24/7 ప్రయత్నాలు మరియు ఖచ్చితమైన దర్యాప్తు ద్వారా, మేము పైన పేర్కొన్న ఫలితాలను సాధించాము. నివారణ చర్యలు: నివారణ చర్యలలో భాగంగా, మే-2025 నెలలో, నగరంలోని వివిధ ప్రదేశాలలో 610 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు, క్రైమ్ వింగ్ అధికారులు 219 నేర అవగాహన సమావేశాలను నిర్వహించి నేరాల రకాలు మరియు నేరస్థుల గురించి మరియు %జజ% కెమెరాల ఏర్పాటు యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. నేరాలు జరిగే ప్రాంతాలలో పగలు మరియు రాత్రి సమయంలో నేర బృందాలతో ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించారు. నేరస్థులపై నిఘా కోసం ఐసోలేటెడ్ ప్రాంతాలలో డ్రోన్ బీట్‌లను కొనసాగిస్తున్నారు. చాట్‌బాట్/సీఐఆర్ - దొంగిలించబడిన/పోయిన మొబైల్స్ రికవరీ ? ఈ నెలలో స్వాధీనం చేసుకున్న మొబైల్స్ సంఖ్య-380 విలువైన రూ.57 లక్షలు ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న మొత్తం మొబైల్ ఫోన్ల సంఖ్య-6134 విలువైన రూ.9.20 కోట్లు. ఫిర్యాదు చేయడానికి, చాట్‌బాట్ నంబర్ 9490617916 లేదా సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించండి.





## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : జనసేన పార్టీ నాయకులు తోట నగేష్






**నషా ముక్త్ భారత్ అభియాన్ భారీ అవగాహన ర్యాలీ**

**పాయకరావుపేట,పెన్ పవర్ , జూన్ 27 :** డ్రగ్స్ అనే మహమ్మారిని మొక్కగా ఉన్నప్పుడే తుంచేసే ఉద్దేశంతో విద్యార్థిని విద్యార్థులకు యువకులకు అవగాహన కల్పించి డ్రగ్స్ బారిన పడకుండా చూడాలని జనసేన పార్టీ నాయకులు తోట నగేష్ పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డ్రగ్స్ బారిన పడి చాలా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, వేల మంది జీవితాలు నాశనం అవుతున్నాయిని, ఆర్థికంగా వెనకబడడం జరుగుతున్నదని అన్నారు. కొంతమంది విద్యార్థిని, విద్యార్థులు తెలిసి, తెలియని వయసులో డ్రగ్స్ భారీన పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని నాయకులు తోట నగేష్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మాదకద్రవ్యాలను ఉపయోగించడం వలన సమాజానికి, మనకు మన భవిష్యత్తు తరాల వారికి, విద్యార్థులకు ఎంత ప్రమాదకరము తెలియజేసేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మాదకద్రవ్యాలు మనకు కనపడకుండా మన చుట్టూ చేరి మన కుటుంబాన్ని మన భవిష్యత్తును నాశనం చేస్తాయని అన్నారు. ఇందుకోసం మన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పోలీసు వ్యవస్థ, ప్రభుత్వ యంత్రాంగం అందరూ కలిసి మాదకద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను విద్యార్థిని విద్యార్థులకు యువతకు ప్రజలకు అందరికీ అవగాహన కల్పించి డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంకు ముఖద్వారంగా అనకాపల్లి జిల్లా ఉందని అరికట్టేందుకు ఇప్పటికే పోలీసు వారు పటిష్టంగా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. చెక్‌పోస్టులు, చెక్‌పాయింట్లు ఏర్పాటు చేసి, ప్రత్యేక బృందాలతో నిఘా ముమ్మరం చేయవలసిన బాధ్యత ఉందని అన్నారు. ఇప్పుడు డ్రోన్లు, మాదకద్రవ్యాలను పసిగట్టే జాగిలాలు (బన్నీ, రీటా) సహాయంతో కీలక ప్రాంతాలలో తనిఖీలు చేపట్టాలన్నారు. రవాణా మార్గాలు, అటవీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి మాదకద్రవ్యాల రహిత దేశంగా కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. అలాగే
పాఠశాలలులో,కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు ఒకే పనిగా నిర్వహించాలని, యాంటీ డ్రగ్ కమిటీలు పాటిష్టంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై సమాచారం అందించడానికి రాష్ట్ర కూటమి ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్:1972, 100/112, ఏర్పాటు చేసిందని తెలిపారు.లేదా 9392918196 నంబర్లను సంప్రదించవచ్చు. ఇలాంటి సమాచారంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు. మాదకద్రవ్యాల రహితంగా దేశం మారాలంటే ఈ పది సూత్రాలు పాటించాలని నాయకులు తోట నగేష్ పేరు తెలిపారు తెలియజేశారు.

1. మత్తు వద్దు- ఆరోగ్యం ముద్దు
2. జీవితాన్ని ప్రేమించు- డ్రగ్స్ కు దూరంగా ఉండు
3. మత్తు ఆపకపోతే జీవితం చిత్తే 4. మత్తును ఆపి చూడు జీవితాన్ని గెలిచి చూడు5. గంజాయి జోలికి వెళ్ళకు- ఎంజాయ్ జీవితం వదలకు 6. యువత మత్తు- సమాజానికి విపత్తు 7. డ్రగ్స్ సరదా కాదు- మరణ శాసనం 8. డ్రగ్స్ వద్దు- ఫ్యామిలీ ముద్దు
9. డ్రగ్స్ ని తరిమికొడదాం- యువతను కాపాడుదాం 10. ప్రతి సిగరెట్టు- మృత్యువు మెట్టు వినాదాలతో ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యార్థులు, అధికారులు పోలీస్ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు



## డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధిద్దాం





**కొయ్యూరు, పెన్ పవర్,జూన్ 26:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చింతపల్లి డివిజన్ మర్రిపాలెం చెక్ పోస్ట్ వద్ద యువతకు మరియు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎఫ్ఓ వైవి నరసింహారావు ఆదేశాల మేరకు అటవీ శాఖ జారీ చేసిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూముల యందు గంజాయి పండించటం, అలాగే రవాణా చేయటం చట్టరీత్యా నేరమని, వాటికి దూరంగా ఉండాలని అవగాహన కల్పించడం జరిగింది. అలాగే మర్రిపాలెం జంక్షన్ వద్ద చెక్ పోస్టులో వాహనదారులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ ను సాధిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జి.అనిల్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పి వరహాల బాబు, వంతల వినోద్ కుమార్, ఏబీవోలు కే. జ్యోతి,ఎం.సుమిత్ర పాల్గొన్నారు.

# బస్సు సౌకర్యం కల్పించాలి..

**గుమ్మలక్ష్మీపురం జూన్ 26. పెన్ పవర్.** తాడికొండ గ్రామానికి మధ్యాహ్నం పూట బస్సు సౌకర్యం కల్పించాలని తాడికొండ గ్రామపంచాయతీకు చెందిన ఎనిమిది గ్రామాల ప్రజలు పత్రికా విలేకరుల ద్వారా ఆర్టీసీ డిపో మేనేజ్మెంట్ కి కోరుతున్నామని ఉన్నారు.గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి వివిధ పనులతో తహసిల్దార్ కార్యాలయం,కు ఎంపీడీవో కార్యాలయం,కు బ్యాంకులకు.అటవీ ఉత్పత్తుల అమ్మ కోనేందుకు మొదలుగునవి పంచాయతీకి చెందిన ఎనిమిది గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వెళ్తుంటారు. మధ్యాహ్నం పూట బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని కావున ప్రయాణికుల సౌకర్యార్థం మధ్యాహ్నం పూట తాడికొండ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని పంచాయతీ ప్రజలు ఆర్టీసీ డి.ఎం కు కోరుతున్నామని అన్నారు.

# యువత మేలుకో - మత్తు నుంచి తేరుకో






- సే నో టు డ్రగ్స్ - సే యెస్ టు లైఫ్
- డ్రగ్స్ వద్దు - ప్రాణం ముద్దు
- డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్
- నషా ముక్త్ భారత్ అభియాన్ భారీ అవగాహన ర్యాలీ

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, అనకాపల్లి, జూన్ 26 :** జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భం గా గురువారం అనకాపల్లి పట్టణం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జిల్లా ఎక్సయిజ్ సహాయ కమీషనర్ సూర్జిత్ సింగ్ తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ముందుగా పోలీస్, ఎక్సయిజ్ శాఖలు ఏర్పాటు చేసిన డ్రగ్స్, గంజాయి, ఫోటో గ్యాలరీలను జిల్లా ఎస్పీ తో పాటు కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమం లో మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక జానపద గేయ్యాన్ని జి వి ఎం సీ టౌన్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ఆలపించారు, డైట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నాటక ప్రదర్శన లో ఆకర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారిని మొక్కగా ఉన్నప్పుడే తుంచేసే ఉద్దేశంతో విద్యార్థిని విద్యార్థులకు యువకులకు అవగాహన కల్పించి డ్రగ్స్ బారిన పడకుండా చూడాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డ్రగ్స్ బారిన పడి చాలా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయ ని, వేల మంది జీవితాలు నాశనం అవుతు న్నాయిని, ఆర్థికంగా వెనకబడడం జరుగుతున్న దని అన్నారు. కొంతమంది విద్యార్థిని, విద్యార్థు లు తెలిసి, తెలియని వయసులో డ్రగ్స్ భారీన పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నా రని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మాదకద్రవ్యాలను ఉపయోగించడం వలన సమాజానికి, మనకు మన భవిష్యత్తు తరాల వారికి, విద్యార్థులకు ఎంత ప్రమాదకర ము తెలియజేసేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మాదకద్రవ్యాలు మనకు కనపడకుండా మన చుట్టూ చేరి మన కుటుం బాన్ని మన భవిష్యత్తును నాశనం చేస్తాయని అన్నారు. ఇందుకోసం మన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. గౌరవ రాష్ట ముఖ్యమంత్రి, పోలీసు వ్యవస్థ, ప్రభుత్వ యంత్రాంగం అందరూ కలిసి మాదకద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను విద్యార్థిని విద్యార్థులకు యువతకు ప్రజలకు అందరికీ అవగాహన కల్పించి డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తున్నారన్నారు. జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం అరికట్టేందుకు 5 స్టాటిక్ చెక్‌పోస్టులు, 38 డైనమిక్ చెక్‌పాయింట్లు ఏర్పాటు చేసి, ప్రత్యేక బృందాలతో నిఘా ముమ్మరం చేయడమేకాక, డ్రోన్లు, మాదకద్ర వ్యాలను పసిగట్టే జాగిలాలు (బన్నీ, రీటా) సహాయంతో కీలక ప్రాంతాలలో తనిఖీలు చేపట్టాం. రవాణా మార్గాలు, అటవీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సరించమన్నారు 2025లో అనకాపల్లి జిల్లా మాదకద్రవ్య నేరాలపై తీసుకు న్న చర్యలు,మొత్తం 74 గంజాయి కేసులు, 237 మంది నిందితుల అరెస్టు 4,904 కేజీలు గంజాయి, 5.39 లీటర్ల హషీష్ ఆయిల్, 59 వాహనాలు స్వాధీనం మొత్తం సుమారు విలువ రూ.2.50 కోట్లు 11 మందిపై పీడీ యాక్ట్, మరో 4 గురిపై పీడీ యాక్ట్/పిట్ ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం ప్రతిపాదనలు పంపడం జరిగింది.505 సస్పెక్ట్ షీట్లు, 3 కేడి షీట్లు, 2 రౌడీషీట్లు తెరవడం జరిగింది.పునరావాస చర్యలు,డీ–అడిక్షన్ సెంటర్‌లో 15 పడకలు ఏర్పాటు,మత్తుకు బానిసైన 2,582 మందికి చికిత్స, వీరిలో 21 మంది గంజాయి వినియోగదారులుఅవగాహన కార్యక్రమాలు:360 పాఠశాలలు, 159 కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. 136 యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ప్రజలకు విజ్ఞప్తి: మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై సమాచారం అందించడానికి టోల్ ఫ్రీ నెంబర్:1972, 100/112, లేదా 9392918196 నంబర్లను సంప్రదించవచ్చు. ఇలాంటి సమాచారంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోందని జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా తెలిపారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎస్పీ నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి హాజరైన వారితో డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చెయించారు. అనంతరం పోలీస్, ఎక్సయిజ్, రెవెన్యూ శాఖల సిబ్బంది , వార్డు సచివాలయల సిబ్బంది, ఎన్.సీ.సీ. విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉన్నత పాఠశాల, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీని అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం నుండి పెంటకోట భవనం వరకు నిర్వహించగా, ర్యాలీని జిల్లా ఎస్పీ శ్రీ తుహీన్ సిన్హా తో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ కృష్ణన్ జెండా ఊపి ప్రారంభిం చారు. సే నో టు డ్రగ్స్ %–% సే యెస్ టు లైఫ్ "డ్రగ్స్ వద్దు %–% ప్రాణం ముద్దు", "యువత మేలుకో %–% మత్తు నుంచి తేరుకో" అనే నినాదాలతో విద్యార్థులు హెూరెత్తించారు 1. మత్తు వద్దు– ఆరోగ్యం ముద్దు 2.జీవితాన్ని ప్రేమించు– డ్రగ్స్ కు దూరంగా ఉండు

3. మత్తు ఆపకపోతే జీవితం చిత్తే 4. మత్తును ఆపి చూడు జీవితాన్ని గెలిచి చూడు5. గంజాయి జోలికి వెళ్ళకు– ఎంజాయ్ జీవితం వదలకు 6. యువత మత్తు– సమాజానికి విపత్తు 7. డ్రగ్స్ సరదా కాదు– మరణ శాసనం 8. డ్రగ్స్ వద్దు– ఫ్యామిలీ ముద్దు 9. డ్రగ్స్ ని తరిమికొడదాం– యువతను కాపాడుదాం 10. ప్రతి సిగరెట్టు– మృత్యువు మెట్టు వినాదాలతో ర్యాలీ కొనసాగించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సయిజ్ శాఖ సహా య కమిషనర్ సూర్జిత్ సింగ్, జిల్లా ఎక్సయిజ్ అధికారి వి సుదీర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలాజీ, అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా, అనకాపల్లి డి. ఎస్పీ శ్రావణి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్లా సురేంద్ర బాబు, జిల్లా బి జె పి అధ్యక్షులు డి.పరమేశ్వరరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి సుజాత, మండల ప్రత్యేక అధికారి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్ వి ఎస్ సుబ్బలక్ష్మి, సీ ఐ లు, ఎక్సయిజ్ సీ ఐ లు, ఎస్ ఐ లు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఆశా వర్కర్లు, ఎ ఎన్ ఎం లు, అంగన్వాడీ కార్యకర్త లు, పెద్ద సంఖ్యలో ఎన్ సీ సీ విద్యార్థులు, పాఠశాల, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, యువత, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం







**సింహాచలం, పెన్ పవర్, జూన్ 26 :** ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## గంజాయి రహిత రాష్ట్రంగా సాధిద్దాం







- మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి...భవిష్యత్తును కాపాడుకోండి.
- చింతపల్లి సీఐ వినోద్ బాబు

**చింతపల్లిపెన్ పవర్ జూన్ 26:–** చింతపల్లి మండల కేంద్రంలోగురువారం రోజున ఆరోగ్య, రెవెన్యూ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, అటవీ, విద్యాశాఖల సమన్వయంతో నిర్వహించినఅవగాహన ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఎంపీడీవో యు.వి.ఎస్. శ్రీనివాసరావు ర్యాలీకి నేతృత్వం వహించారు.మత్తుపదార్థాల యువత తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, డ్రగ్స్ మరియు గంజాయి వాడకం శారీరకంగా, మానసికంగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని చింతపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వినోద్ బాబు స్పష్టం చేశారు. నిరోధక గంజాయి సాగు, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఈ చైతన్య ర్యాలీ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించబడింది. ఈ సందర్భంగా సీఐ వినోద్ బాబు మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రం నుంచి అల్లూరి జిల్లామార్గంగా గంజాయి అక్రమ రవాణా జరిగి ఇతర రాష్ట్రాలకు సరఫరా అవుతున్నదని పేర్కొన్నారు. దీనిని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కుటుంబాలు శారీరక, ఆర్థికంగా బాధలు పడుతున్నాయని, కుటుంబ వ్యవస్థలు చెదిరిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి మత్తులో వ్యక్తులు ఏమి జరుగుతున్నదీ గ్రహించలేని స్థితిలోకి వెళుతున్నారు. వీటిలో పాల్గొన్నవారిని పోలీసులు గుర్తించి అరెస్టు చేయడంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని అన్నారు. యువత మత్తు ప్రలోభాలకు లోనుకాకుండా బాధ్యతాయుతంగా తమ జీవితాలను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వరరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. ఇంద్ర ప్రియాంక, ఎక్సైజ్ సీఐ కుర్మారావు, గిరిజన ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాగిన రామరాజు పడాల్, ఐసిడీఎస్ అదనపు ప్రాజెక్ట్ అధికారిణి ఎం. రామలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖరరావు, రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లంబసింగి ఘాట్ రోడ్ టూ స్టాప్ బస్సు కు తప్పిన ప్రమాదం.

**ఆర్ టీ సీ డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు సురక్షితం.**

**చింతపల్లి పెన్ పవర్ జూన్ 26 : –** లంబసింగి ఘాట్ రోడ్ లో టూ స్టాప్ ఆర్ టీ సీ బస్ కు త్రుటిలో ప్రమాదం.తప్పింది. చింతపల్లి నుండి నర్సీపట్నం వెళ్తున్న టూ స్టాప్ ఆర్టీసీ బస్సు ( ఏ పీ 31 జెడ్ 0438) ను ఎదురుగా వస్తున్న ఏ పీ 39 యూ వై 3669 నెంబర్ గల బొలెరో వాహనం పరిమితికి మించిన వేగంగా రావడంతో ఆర్ టీ సీ బస్ డ్రైవర్ చాకచక్యంగా బస్ ను అదుపు చేసి నప్పటికీ, వేగాన్ని అదుపు చేయలేని బొలెరో వాహన చోదకుడు కొండ రహదారిలో మలుపు వద్ద ఆర్ టీ సీ బస్ ను డ్రైవర్ వైపు గుద్దుకుంటూ వెళ్ళడంతో బస్ అద్దాలు పగలడంతో బస్ లోని ప్రయాణీకులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ క్రమంలో చాకచక్యంగా వ్యవహరించిన టూ స్టాప్ ఆర్ టీ సీ బస్ డ్రైవర్ ను ప్రయాణికులు అభినందించారు.






## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవగాహన ర్యాలీ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూన్ 26:** ప్రపంచ మాదకద్రవ్యల వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గూడెం కొత్త వీధి మండల కేంద్రాంలో మాదకద్రవ్యాలను నిరోధించాలని, మత్తుకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తూ గూడెం కొత్త వీధి పోలీస్ స్టేషన్ నుండి సంత బయలు వరకు పోలీసులు మరియు ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గంజాయి రహిత రాష్ట్రాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు ఇతర మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. గూడెం కొత్త వీధి సెంటర్లో మానవహారం నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు సంతోష్ కుమార్, జగన్నాథం, సిఆర్పిఎఫ్ పోలీసులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉప్పాటి శివశంకర్ కు ఆత్మీయ సత్కారం



**ఎన్ఏడి, పెన్ పవర్, జూన్ 26 :** ఇటీవల వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ గా బాధ్యులు స్వీకరించిన ఉప్పాటి శివశంకర్ కు ఆత్మీయ సత్కారం లభించింది. ఈ మేరకు గురువారం 91వ వార్డు రామకృష్ణనగర్లో విశ్వశాంతి సంక్షేమ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లీగల్ అడ్వైజర్ చెవ్వేటి జీవన్ కుమార్ సంఘ సభ్యులు సమక్షంలో శివ శంకర్ కు పుష్పగుచ్చం అందజేసి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టించి పనిచేసే వ్యక్తి శివ ఆయన చేసిన సేవను గుర్తించి పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ పి.గణబాబు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవికి ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు కోనాల సంజీవన్, సభ్యులు ఎలక వీర్రాజు, కోనాల కరుణ్ కుమార్, ఎన్ఎడి శ్రీను, కడితి శివ, చెవ్వేటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ మహేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ న్యాయవాది అంబేద్కర్



**పాయకరావుపేట, పెన్ పవర్, జూన్ 27.** గురువారం పాయకరావుపేట నూతన తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన మహేష్ ను ప్రముఖ న్యాయవాది బోడ అంబేద్కర్ మర్యాదపూర్గా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది అంబేద్కర్ మాట్లాడుతూ మండలంలో అనేక భూ సమస్యలు ఉన్నాయని వాటిని త్వరితగతిని పరిష్కరించి నిరుపేద ప్రజలకు న్యాయం చేకూరేలా కృషి చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. తద్వారా తాసిల్దార్ మహేష్ సానుకూలంగా స్పందించి న్యాయపరంగా ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని సందర్భంగా తెలియజేశారని తెలిపారు.

## శ్రీ స్వామివారి నిత్యాన్న ప్రసాదమునకు విరాళం




**సింహాచలం, పెన్ పవర్, జూన్ 26 :** శ్రీ స్వామివారి నిత్యాన్న ప్రసాదమునకు గుంటూరు జిల్లా కుంచనపల్లి కి చెందిన మానే రజిని లక్ష రూపాయలు చెక్కు రూపంలో పిఆర్ఓ ఆఫీస్ నందు గల డొనేషన్ కౌంటర్ నందు సీనియర్ సహాయకులు వి. సూర్యనారాయణకు అందజేశారు. ఇందు పై వచ్చే వడ్డీతో ఒక రోజు తమ పేరున స్వామివారి నిత్యఅన్న ప్రసాదం భక్తులకు అందించవలసిందిగా కోరారు. దాతకు స్వామివారి దర్శనము, అనంతరము ఆలయ పర్యవేక్షణ అధికారి త్రిమూర్తులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం






**చింతపల్లి పెన్ పవర్ జూన్ 26 :**-ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతపల్లిలో ప్రిన్సిపాల్ డాక్టర్ఎం. విజయభారతి సూచన మేరకు నషా ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్య క్రమంలో విద్యార్థిని,విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం పైన కలిగే నష్టాలను గురించి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ పాత్రుడు అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.రమణ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సేవించిన, రవాణా చేసిన చట్టరీత్యా శిక్షింపబడతారు అని వివరించారు. అలాగే ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల తీవ్ర మానసిక శారీరిక కలుగుతాయని వాటికి దూరంగా ఉండాలని, భారతదేశాన్ని మాదకద్రవ్యాల నిర్మూలనదేశముగా తీర్చిదిద్దే బాధ్యత యువత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు లీలా పావని మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం మాదక ద్రవ్యాల వ్యతిరేకంపై ర్యాలీ నిర్వహించడం జరిగింది.

## మాదకద్రవ్యాల రహిత భారతదేశంగా తీర్చిదిద్దాలి.

- అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్ రావు







**పాయకరావుపేట పెన్ పవర్ జూన్ 27:** మాదకద్రవ్యాల రహిత భారత దేశంగా యువత తీర్చిదిద్దాలని అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సాయి ఉత్సవ్ కళ్యాణ్ మండపం వద్ద తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెంచలపు ప్రదీప్ (పద్దు), పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాల బాబు అధ్యక్షతన పట్టణ సిఐ. జి. అప్పన్న ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలు యువత -నాయకులు సహకరించాలని ఇప్పటికే అనేక విధాలుగా డ్రోన్స్ కెమెరాతో నిఘాలు ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తున్నామని గత వాతావరణం కన్నా ప్రస్తుతం గంజాయి తరలింపు తగ్గిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అదేవిధంగా ఈ సమావేశంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు తోట నగేష్, జనసేన పార్టీ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి నియోజకవర్గ,టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశు లు పలు అంశాలపై ప్రసంగించి గంజాయి ఎక్కడైనా ఉన్నట్లయితే వెంటనే అధికారులకు తెలియజేసి వారి కుటుంబం పాడవకుండా ప్రతి విద్యార్థి బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేస్తూ స్థానిక సాయి ఉత్సవ్ కల్యాణ మండపం నుంచి గౌతమ్ థియేటర్ సెంటర్ వద్ద వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ ర్యాలీలో నాషా ముక్త భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పేట తహసీల్దార్,ఎంపీడీవో సిడిపిఓ ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్లు, ఎంఈఓ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ఽ

## ప్రజల్ని కలవకుండా అడ్డుకునేందుకే ఈ కేసు

- నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టేయాలంటూ వైయస్ జగన్ క్వాష్ పిటిషన్
- నేడు హైకోర్టులో విచారణ

**తాడేపల్లి:** వైయస్ఆర్‌సీపీ కార్యకర్త సింగయ్య మృతి కేసులో కుట్రపూరితంగా తన పేరును చేర్చారంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. నల్లపాడు పోలీసులు నమోదుచేసిన కేసును కొట్టేయాలంటూ క్వాష్ పిటిషన్ వేయగా.. ఇవాళ అది విచారణకు రానుంది.

జూన్ 18వ తేదీన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ గ్రామానికి వైఎస్ జగన్ వెళ్లారు. ఆ పర్యటనలో ఆయన ప్రయాణిస్తున్న వాహనం ఢీకొని చీలి సింగయ్య అనే దళితుడు మృతిచెందాడని నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే.. రాజకీయ ప్రతీకారంతోనే తనపై ఈ కేసు పెట్టారని జగన్ ఏపీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు.

**పిటిషన్‌లో ఏముందంటే..**

మృతుడి భార్య లూర్థు మేరీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) సెక్షన్ 106(1) (నిర్లక్ష్యం కారణంగా చావుకు కారకులు) ప్రకారం మొదట కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఎందుకనో.. బీఎన్ఎస్ సెక్షన్ 105 (హత్య కిందకు రాని కల్పబుల్ హెూమిసైడ్), 49 (నేరానికి ప్రేరేపించడం) సెక్షన్లుగా మార్చారు.

మృతుడు సింగయ్య గాయాలను చూస్తే అతడు ఆ వాహనం కిందపడి నలిగినట్లు లేదని.. పోలీసుల వాదన నమ్మదగినదిగా లేదు.

ప్రమాదానికి టాటా సఫారీ వాహనం కారణమని మొదట్లో పోలీసులు తెలిపారు. ఆ వాహన యజమానిని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వాంగ్మూలాలను నమోదు చేసి, పూచీకత్తు తీసుకున్నాక బెయిల్‌పై విడుదల చేశారు.

కాన్వాయ్‌లోని గుర్తుతెలియని వాహనం సింగయ్యను ఢీకొన్నట్లు గుంటూరు ఎస్పీ స్వయంగా ప్రకటించారు.

నా పర్యటన(రెంటపాళ్ల) వివరాలను పోలీసులకు ముందుగానే అందజేసినా.. తగిన భద్రత కల్పించడంలో విఫలమయ్యారు.

# కూటమి సాక్షిగా అంబేద్కరునికి అవమానం





- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఫ్లెక్సీలు కట్టిన వారిపై చర్యలు చేపట్టాలి
- జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దద్దిమి కోటేశ్వరరావు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూన్ 26:** జీవీఎంసీ 13 వ వార్డు రామకృష్ణాపురం గ్రామ దేవత శ్రీ శ్రీ పైడిమాంబ అమ్మవారి జాతర సందర్భంగా కూటమి నాయకుల ఫ్లెక్సీలు అమ్మవారు గుడి ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.రాజ్యాంగం నిర్మిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆనుకుని పూర్తిగా మూసివేసి నిర్వాహకులు ఫ్లెక్సీలుపెట్టారు. ఈ చర్యలు ఖండిస్తూ కూటమి నాయకుల ఫ్లెక్సీల విషయమై వార్త పత్రికలలో వచ్చిన నిర్వాహకులు పట్టించుకోలేకాపోవడం దారుణమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దధిమి కోటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. అమ్మవారి పండుగ సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడం ఎటువంటి అభ్యంతరాలు లేకపోయినప్పటికీ కూటమి నాయకుల ఫ్లెక్సీలతో ఆ మహనీయుని వ అవమానం కలిగించారని మాల మహానాడు అధ్యక్షుడు దద్దిమి కోటేశ్వరరావు అన్నారు. రామకృష్ణాపురం గ్రామానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గ్రామ అభ్యుదయ సేవా సంఘం అని నామకరణ చేసుకొని ఇటువంటి నీచమైన పనులు చేస్తూ దిగజారుతున్న నాయకులకు వారికి సహకరిస్తున్న పెద్దలకు ఈ విషయం తెలియదా ! మహనీయుని విగ్రహం కనిపించలేదా అని ఆయన నిర్వాహకులము ప్రశ్నించారు.

విగ్రహాన్ని కూటమి నాయకుల ఫ్లెక్సీలతో మూసివేసి తమకేమీ పట్టలేనట్లు వ్యవహరిస్తూ అంబేద్కర్ సిద్ధాంతాలను కాలరాస్తూ అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తూన్న వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఈ క్రమంలోనే మాల మహానాడు మాజీ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కారం శివాజీ దృష్టి కి కూడా తీసుకెళ్లే ప్రక్రియ చేపడతామని తెలియజేశారు.

## రెచ్చిపోతున్న దొంగలు - మూడు దుకాణాల్లో చోరీ







నగదుతో పాటు పలు కిరాణా సామాన్ల చోరీ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 26 :**మండల కేంద్రంలో రాత్రి సమయాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. దుకాణ సముదాయాలే లక్ష్యంగా చేసుకొని పలుచోరీలకు పాల్పడుతున్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలో గల ప్రభాకర్ రావుకు చెందిన శ్రీలక్ష్మి కిరాణా జనరల్ స్టోర్స్, రమణ కు చెందిన బార్బర్ షాప్, కె.వి.ఆర్ నాగరాజు కు చెందిన మెడికల్ షాపుల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ దుకాణాల్లో నగదు తో పాటు పలు కిరాణా సామాన్లు దొంగలు ఎత్తుకుపోయారు. రాత్రి ఒంటి గంట నుండి తెల్లవారుజాము మూడు గంటల మధ్య చోరీ జరిగినట్లు పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీ లో రికార్డు అయ్యింది. ఈ చోరీలకు పాల్పడుతున్నది ఒక మహిళగా సిసిటీవీలో కనబడుతోంది. గడిచిన మూడు నెలల క్రితం ఇదే మహిళ పలు దుకాణాల్లో చోరీకి పాల్పడినట్లు అప్పట్లో సిసి టీవీ ఫుటేజ్ లో నమోదయి ఉంది. మూడు నెలల అనంతరం మరల అదే మహిళ తాజాగా బుధవారం దుకాణాల్లో చోరీకి పాల్పడింది. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు చోరీకి గురైన దుకాణాలను సందర్శించి సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలిస్తున్నారు. చోరీలకు పాల్పడుతున్న మహిళ ఇనుపరాడు సహాయంతో దుకాణాల తాళాలను గొల్లెలను విరగొట్టి చోరీలకు పాల్పడుతుంది. నిత్యం ఏదో ఒకచోట చోరీలు జరుగుతుండడంతో మండల వాసులు భయందోళనకు గురవుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు రాత్రి సమయాల్లో పోలీస్ గస్తీని ముమ్మరం చేసి చోరీలు జరగకుండా చూడాలని మండలవాసులు, వ్యాపారులు కోరుతున్నారు.

## వైభవంగా శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామివారి స్వర్ణ పుష్పార్చన







**సింహాచలం, పెన్ పవర్, జూన్ 26 :** శ్రీ స్వామివారి స్వర్ణ పుష్పార్చన ఆలయ వైదిక సిబ్బంది ఆలయ అధికారులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తముగా 108 బంగారు స్వర్ణ పుష్పార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వర్ణ పుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్ణ తులసీదళార్చన అత్యంత వైభవంగా, సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధీష్టింప జేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన , సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.

## భాగ్యవతి సేవా సంఘం ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్ పంపిణి

- భాగ్యవతి సేవా సంఘం సేవలు అపూర్వం.
- పోతురాజుపుట్టు ప్రధానోపాధ్యాయులు లకేదాసు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 26.**మండలంలో గల పనసపుట్టు పంచాయితీ, పోతురాజు పుట్టు ఎంపీపీ పాఠశాలలో భాగ్యవతి సేవా సంఘం అధ్యక్షురాలు జర్రెల సర్పంచ్ బోర్గం భాగ్యవతి ఆదేశాలతో భాగ్యవతి సేవాసంఘం సభ్యులు విద్యార్థినీ విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు లకే దాసు సమక్షంలో సభ్యులు పూర్ణరావు, పూర్ణమ్మ చేతులమీదుగా స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసు మాట్లాడుతూ.. భాగ్యవతి సేవా సంఘం ఆధ్వర్యంలో మండలంలో అనేక పాఠశాలలో నిరుపేద విద్యార్థిని, విద్యార్థులకు తమకు తోచినంత సొంత నిధులతో ఆర్థిక సాయం చేయడం శుభపరిమాణమని అన్నారు. నేడు మా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారని, ఓ పక్క సర్పంచ్ గా పంచాయతీ ప్రజలను సేవలందిస్తూ.. సేవ చేయాలనే సంకల్పంతో మారుమూల గిరిజన పాఠశాలలో గిరిజన విద్యార్థిని విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, తదితర సామాగ్రిలు పంపిణీ చేస్తూన్న సర్పంచ్ భాగ్యవతికి మండలంలో మంచి పేరు ప్రఖ్యాతలు దక్కుతుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయటం కొంతమందికే సాధ్యమని పేర్కొన్నారు. భాగ్యవతి సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో అనేక సేవా కార్యక్రమాలు సేవా సంఘం ద్వారా చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యవతి సేవా సంఘం సభ్యులు బొర్గం సింహాద్రి, కె రాజు, జె బలరం, రఘురాం, త్రినాథ్, జగబంధు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా భారీ అవగాహన ర్యాలీ






**అనకాపల్లి, పెనపవర్, జూన్ 26:** జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ , జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ ర్యాలీ ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమై, మెయిన్ రోడ్ మీదుగా పెంటకోట కన్వెన్షన్ హాల్ వరకు ఘనంగా సాగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రామికులు, విద్యార్థులు, అధికారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ, “ఆంధ్రప్రదేశ్‌ను మాదక ద్రవ్యాలు, గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలి” అని పిలుపునిచ్చారు. అలాగే, యువత మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉండాలని, ఎవరైనా గంజాయి లేదా మాదక ద్రవ్యాల వినియోగం చేస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, “సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే, మాదక ద్రవ్యాలకు స్థానం ఉండకూడదు. అందుకే ఇది అందరికి బాధ్యతగా భావించి ముందుకెళ్లాలి” అన్నారు.

కార్యక్రమ ముగింపు సందర్భంగా పాల్గొన్నవారంతా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు.

# జాతీయ రహదారిపై లారీ బోల్తా: డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

## అదుపుతప్పి బోల్తా పడిన కోడిగుడ్ల లోడు లారీ



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 26:** ఒంగోలు నుంచి గుంటూరు వైపు కోడిగుడ్ల లోడుతో వెళు తున్న ఒక మినీ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే, డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. లారీ బోల్తా పడటంతో అందులోని కోడిగుడ్లు పూర్తిగా పగిలిపోయాయి. ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను వెంటనే అంబులెన్స్ ద్వారా చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

## గృహాల్లో నివాసం లేకుంటే...

# ప్రభుత్వ సంకల్పం ఎలా నెరవేరుతుంది?

ఇళ్లులేనివారు బాధపడుతుంటే... ప్రభుత్వమిచ్చిన ఇళ్లలో ఉండటానికి టిడ్కో లబ్ధిదారులకు ఇబ్బందేమిటి? : ప్రత్తిపాటి.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టిడ్కో గృహాల సద్వినియోగ సమస్యపై ముఖ్యమంత్రితో మాట్లాడతాను :ప్రత్తిపాటి.

మెప్మా...డ్వాక్రా మహిళల్ని బెదిరించి అవినీతికి పాల్పడిన గొప్ప చరిత్ర గత పాలకులది : ప్రత్తిపాటి.









**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 26:** టిడ్కో గృహాల లబ్ధిదారులు వాటిలో ఎందుకు నివాసముం డటం లేదని, పట్టణ పరిధిలోని పేదలకోసం గతంలో టీడీపీప్రభుత్వం 4,512 ఇళ్లు నిర్మించి మౌలికవసతులు కల్పించినా, ఇప్పటికీ 3,300 గృహాలు ఖాళీగా ఉండటం ఏమిటని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అధికారుల్ని ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన సంబంధిత అధికారులతో టిడ్కో గృహాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

**టిడ్కో గృహాల సద్వినియోగంపై ముఖ్యమంత్రితో చర్చిస్తాను...:** లక్షలు వెచ్చించి నిర్మించిన ఇళ్లలో ఉండటానికి గతంలో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నవారంతా ఎందుకు నివాసం ఉండటంలేదో వారినే అడిగి తెలుసుకోవాలని, వారు నివాసానికి విముఖంగా ఉంటే ఆ ఇళ్లను ఇతరులకు కేటాయించాలని ప్రత్తిపాటి అధికారుల్ని ఆదేశించారు. ఇళ్లలో నివాసం ఉండకపోతే... అవి పాడైపోవడంతో పాటు.. ప్రభుత్వ సంకల్పానికి చెడ్డపేరు వస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. కూటమిప్రభుత్వం వచ్చినప్పటినుంచీ లబ్ధిదారులు గృహాల్లో నివాసముండేలా అన్నిచర్యలు తీసుకుందన్నారు. రోడ్లు..వీధిదీపాల ఏర్పాటుతో పాటు మౌలిక వసతులు కల్పించినా ఇళ్లు నిరుపయోగంగా ఉంటే ఎలాగని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ఇళ్లు పొందిన వారు వాటిలో నివాసం లేకపోతే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అయినట్టేనని, మరోపక్క మరలా ఇళ్లు కావాలనే దరఖాస్తులు ప్రజల నుంచి వస్తుంటాయని ప్రత్తిపాటి తెలిపారు. ఇళ్లు నిరుపయోగంగా ఉండటమనేది కేవలం చిలకలూరిపేటకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య ఉందని ఆయన చెప్పారు. టిడ్కోగృహాల సద్వినియోగంపై ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులతో సమస్య పరిష్కారంపై చర్చిస్తానని ప్రత్తిపాటి స్పష్టంచేశారు.

**మెప్మా.. డ్వాక్రా మహిళల్ని బెదిరించి డబ్బులు కాజేసిన అవినీతి చరిత్ర గత పాలకులది..**

టిడ్కో గృహాలపై అధికారులతో సమీక్ష అనంతరం ప్రత్తిపాటి మెప్మాసిబ్బందికి ట్యాబ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెప్మా సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆర్పీలు సమర్థవంతంగా పనిచేసి కూటమిప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ప్రత్తిపాటి సూచించారు. గత ప్రభుత్వం.. ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన అవినీతి మంత్రి మెప్మా సిబ్బందిని, డ్వాక్రా మహిళల్ని కూడా దోచుకున్నారని ప్రత్తిపాటి తెలిపారు. విధుల్లో కొనసాగడానికి కాలపరిమితి ఉన్నాకూడా కావాలని సదరు అవినీతి మంత్రి గ్రూపు సభ్యుల్ని భయపెట్టి, వారినుంచి అన్యాయంగా రూ.1000 నుంచి రూ.6,000 వరకు వసూలు చేశారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెన్యువల్స్ ముసుగులో మెప్మా సిబ్బందిని, డ్వాక్రా మహిళల్నిప్రలోభపెట్టి.. వారి నుంచి అందినకాడికి అడ్డగోలుగా దోచేసి, అవినీతికి పాల్పడిన చరిత్ర గతపాలకులకే దక్కిందన్నారు.

సమావేశంలో టిడ్కో సిఓ, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, గోల్డ్ శ్రీను, నాయకులు షేక్ టీడీపీ కరీముల్లా, పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, సిఐ రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం గంజాయి..

## డ్రగ్స్‌తో యువత జీవితాలు నాశనం చేసింది..

కూటమిప్రభుత్వం గంజాయి... మాదకద్రవ్యాలకు రాష్ట్రంలో స్థానం లేకుండా చేసింది..

మెగాడీఎస్సీ అమలు.. పరిశ్రమల ఏర్పాటుతో

చంద్రబాబు యువత భవితకు ప్రాధాన్యం ఇస్తున్నారు : ప్రత్తిపాటి...







**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 26**

చిలకలూరిపేట: గత ప్రభుత్వం గంజాయి...డ్రగ్స్ కు యువతను బానిసల్ని చేసి వారి జీవితాలు నాశనం చేసిందని, కూటమిప్రభుత్వం గంజాయి కట్టడితో పాటు ఇతర మాదకద్రవ్యాలకు రాష్ట్రంలో స్థానం లేకుండా చేసిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీస్ విభాగం పట్టణంలో చేపట్టిన ర్యాలీలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ఎన్.ఆర్.టీ సెంటర్ వరకు కొనసాగిన ర్యాలీలో సిఐ రమేష్ పోలీస్ సిబ్బందితో పాటు యువత, మహిళలు పాల్గొని.. గంజాయి, మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ ముగిసిన అనంతరం యువత, మహిళలను ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు. గంజాయి.. ఇతర మాదకద్రవ్యాల సంస్కృతిని గతప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టి... అమాయకులైన యువత జీవితాలు నాశనం చేసిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టి అనేక చర్యలు తీసుకున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ఈగల్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు.. ప్రత్యేక బృందాలతో గంజాయి సాగు.. రవాణా..విక్రయాలకు అడ్డుకట్ట వేశారని, ఎక్కడా డ్రగ్స్ కనిపించకుండా చేశారని ప్రత్తిపాటి తెలిపారు. యువత భవిష్యత్ కు ప్రాధాన్యత ఇస్తూ ఇప్పటికే మెగా డీఎస్సీని అమలుచేసిన ప్రభుత్వం... పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ, .ఉపాధి కల్పనకు కృషిచేస్తోందన్నారు. మాదకద్రవ్యాల వాడకం... విక్రయాలవల్ల జరిగే అనర్థాలు యువతకు తెలియచేయడానికే నేడు పోలీస్ శాఖ ర్యాలీ చేపట్టిందని ప్రత్తిపాటి తెలిపారు. ప్రజలు.. ముఖ్యంగా యువత గంజాయి ఇతర మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో పట్టణ పోలీస్లు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, టీడీపీ నాయకులు షేక్ టీడీపీ కరీముల్లా, పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, గోల్డ్ శ్రీను, జాలాది సుబ్బారావు, బేరింగ్ మౌలాలి, కౌన్సిలర్ లు , టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కరణలు దిశగా ప్రభుత్వ పాఠశాలలు..!

## - చర్యలకు ఎమ్మెల్యే జూలకంటి ఆదేశం..!

**వెల్దుర్తి: జూన్ 26 (పెన్ పవర్)** ప్రభుత్వ విద్యలో సమూల మార్పులకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సంస్కరణకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖాధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విధి అమలు చేయవల్సిన అంశాలపై అధికారులకు ఎమ్మెల్యే దిశ నిర్దేశం చేశారు. మన బడి – మన భవిష్యత్తు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాలలో ఎక్కడ అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. అలానే పాఠశాల పరిశరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కౌమార దశలో ఉన్న విద్యార్థులకు కెరియర్ గైడెన్స్, సోషల్ ఎవైర్నెస్ పై ప్రత్యేక అవగాహన తరగతులను నిర్వహించాలని సూచించారు.

**ప్రతి శనివారం యోగా డే ..!**

ప్రభుత్వ పాఠశాలలో ప్రతి శనివారం నిర్వహించే మాస్ డ్రిల్ లో భాగంగా విద్యార్థులతో యోగా చేయించాలని ఎమ్మెల్యే జూలకంటి సూచించారు. బాల్యంలోనే యోగాను విద్యార్థులకు పరిచయం చేయడం వలన వారి ఆరోగ్యమే కాదు కుటుంబ ఆరోగ్యం కూడా బాగుంటుందని ఆకాంక్షించారు. యోగాతో ఆరోగ్యమేకాదు.., సామాజీక చైతన్యం కూడా నిండి ఉందని.., వెంటనే ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మండల విద్యాశాఖ అధికారి అల్లి సురేష్, మాచర్ల జెడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావు, అయేషా, నాగారాజు, బాలనాగమ్మబాయి తదితరులు పాల్గొన్నారు.





# చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు

## - అద్దంకి వైసిపి ఇన్చార్జి హనిమిరెడ్డి

**పెన్ పవర్, జూన్ 26,అద్దంకి**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన రెడ్డిని ప్రజలలోకి వెళ్ళనివ్వకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కుతంత్రాలు చేసి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని అద్దంకి వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ పానెం చిన్న హనిమి రెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన అద్దంకిలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైయస్ఆర్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పట్ల వెల్లువెత్తుతున్న విశేష ప్రజాదరణను చూసి తట్టుకోలేక ఆయన పర్యటనలను అడ్డుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుతంత్రాలు చేస్తోందని హనిమి రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం కల్గిస్తున్న వైయస్ జగన్ ను ప్రజల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడమే ఏకైక లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. జడ్ ప్లస్ కేటగిరి భద్రత కలిగిన మాజీ సీఎం జగన్ భద్రత ఏర్పాట్లు పట్ల కూటమి ప్రభుత్వం కుట్రపూరిత వైఖరిని అవలంభిస్తుందన్నారు. జగన్ మోహన రెడ్డి బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఏకపక్షంగా జప్తు చేయడం చంద్రబాబు సర్కార్ పన్నాగం అన్నా రు. ఏడాది పాలనలో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకు రాజకీయాల్లో భాగంగా ప్రభుత్వం తాజాగా జగన్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని జప్తుచేయడం జరిగిందన్నారు. కేసు దర్యాప్తు పేరిట బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సుదీర్ఘ కాలం జప్తులో ఉంచేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఇంచార్జ్ హనిమి రెడ్డి ఆరోపించారు. సింగయ్య మృతి ఉదంతాన్ని వక్రీకరిస్తూ నమోదుచేసిన అక్రమ కేసు పైన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ న్యాయపోరాటం చేస్తుందని ఇంచార్జ్ హనిమి రెడ్డి అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఎంత విస్తృతంగా పర్యటిస్తే తమ ప్రభుత్వ వైఫల్యాలు అంతగా వెలుగులోకి వస్తాయని టీడీపీ పెద్దల భయపడుతున్నారన్నారు.



జగన్ పర్యటనలకు దారి పొడవునా వేలాది మంది జనం తరలివస్తుండటం చూసి ఓర్వలేక కూటమి నాయకులను కలవర పరుస్తుందన్నారు. ఆ అక్కసుతోనే వైయస్ జగన్ ని భూస్థాపితం చేస్తానని సీఎం చంద్రబాబు ఇటీవల మీడియా లో జరిపిన ఇంటర్వ్యూలో ప్రకటించటం తెలిసిందే అన్నారు. రాజకీయాలకు అతీతంగా మాజీ ముఖ్యమంత్రికి పటిష్ట భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని,40 ఏళ్ల సీనియర్ నాయకుడినని తరుచూ చెప్పుకొనే చంద్రబాబు పూర్తి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని హనిమి రెడ్డి ఏద్దేవా చేశారు.

# జగన్‌లో అప్పటి ఊపు... ఉత్సాహం ఇప్పుడెక్కడ ... ?



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిలో ఊపు ఉత్సాహం కరువైందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. సహజంగా జగన్ రాజకీయంగా ఏం మాట్లాడినా.. ఎవరిపై విమర్శలు చేసినా చాలా ఉత్సాహంగా ఉంటారు. ఉత్సాహంగా వ్యాఖ్యానిస్తారు. కానీ, తాజాగా బుధవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాత్రం ఆయన చాలా నిరుత్సాహంగా కనిపించారు. ఆయన మాట్లాడే విధానం, మాట్లాడే తీరు గమనిస్తే జగన్లో స్పష్టంగా తేడా కనిపించింది. మరి ఈ తేడా ఎందుకు వచ్చింది.. అంటే ప్రస్తుతం ఆయన చుట్టూ అనేక కేసులు ముసురుకున్నాయి. ప్రధానంగా ఆయన ఇంటి నుంచి కారును పోలీసులు తీసుకువెళ్లడంపై మానసికంగా ఆయన ఇబ్బంది పడుతున్నట్టు తెలుస్తోంది. సహజంగా కేసు పెట్టి అందులో జగన్ పేరు చేర్చడంపై కంటే కూడా వ్యక్తిగతంగా ఆయన ఇంటి నుంచి కారు తీసుకెళ్లడాన్ని జగన్ కొంచెం ఫీల్ అవుతున్నారని సమాచారం. దీనికి తోడు పార్టీ నాయకుల పై వరుసగా నమోదు అవుతున్న కేసులు కూడా జగన్‌ను ఇబ్బంది పెడుతున్నాయి. పైకి గంభీరంగా ఉన్నా.. అరెస్టయిన వారిని బయటకు తీసుకురాలేని పరిస్థితి వంటి పరిణామాలు కూడా మానసికంగా జగన్ ను కుంగ తీస్తున్నాయని చెప్పాలి. సహజంగా ధైర్యం, సాహసం వంటి వాటికి జగన్ పేరును పర్యాయపదంగా చెబుతారు. కానీ, మారుతున్న కాలం.. మారుతున్న పరిస్థితులు వంటివి జగన్ను ఆ దిశగా నడిపించడంలో కాస్త వెనుకబాటు కనిపించింది. ఇదే సమయంలో నిరుత్సాహానికి కారణం కూడా అదేనని చెప్పాలి. దీనికి తోడు ఏడాది కాలంలో కూటమిలో అనైక్యత చోటు చేసుకుంటుందని అనుకున్నారు. అంతేకాదు.. ఎక్కడో ఒక చోట విభేదాలు వస్తాయని జగన్ అంచనా వేసుకున్నారు. కానీ అలా జరగలేదు. పైగా కూటమి బలంగా ఉందన్న సంకేతాలు తాజాగా జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. ఇది కూడా జగన్కు మానసిక ఆవేదనను పెంచిందని చెప్పాలి. ఎలా చూసుకున్నా రాజకీయంగా జగన్ కి ఇప్పుడు ఒక సంక్లిష్ట పరిస్థితి అయితే ఏర్పడిందనేది పరిశీలకులు చెబుతున్న మాట. అందుకే ఆయనలో ఊపు, ఉత్సాహం కొరవడిందని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# 'సుపరిపాలన' ప్రోగ్రాంకి వెళ్లుంటే వెనక్కి వచ్చేసేవాడిని.. రఘురామ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏడాది పాలన సందర్భంగా ఇటీవల అమరావతిలో కూటమి ప్రభుత్వం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఘనంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఏపీబీజేపీ చీఫ్ పురందేశ్వరి, మంత్రి లోకేష్.. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఇదే సమయంలో.. ఈ ప్రతిష్టాత్మకమైన 'సుపరిపాలనలో తొలి అడుగు' సదస్సుకు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు! అయితే... ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందంటూ ఉండి ఎమ్మెల్యే, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కీలక వ్యాఖ్యలు చేశారు. అవును... అమరావతిలో ఇటీవల అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందని ఏపీ శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు అన్నారు. ఈ సందర్భంగా... ప్రొటోకాల్ ఉల్లంఘన ప్రభుత్వ పెద్దలకు తెలిసే జరిగిందో.. లేదో నాకు తెలియదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కలెక్టర్ కంటే ఎమ్మెల్యే ప్రొటోకాల్ పెద్దదని తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన రఘురామ... 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ, ఎంపీని ఒక టేబుల్ వద్ద కుర్చోబెట్టారని.. మరో టెబుల్ వద్ద కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి ఎమ్మెల్యేలను కూర్చోబెట్టారని చెప్పిన ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు... ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ నిబంధనలు పాటించలేదని అన్నారు. ఇదే సమయంలో.. ఈ ప్రభుత్వ కార్యక్రమానికి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ను కూడా ఆహ్వానించాలని తెలిపారు. ఈ క్రమంలో... ఎమ్మెల్యేలకు జరిగిన అవమానంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తానని తెలిపారు. అయితే.. ఇది మొదటి తప్పుగా భావిస్తున్నట్లు చెప్పిన ఆయన... కార్యక్రమానికి వెళ్లి ఉంటే సీటింగ్ విధానం చూసి బయటకు వచ్చేసేవాడినని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సందర్భంగా.. ఆ కారక్రమంలో తమకు అవమానం జరిగిందని చాలా మంది ఎమ్మెల్యేలు తనతో చెప్పినందుకే మాట్లాడుతున్నానని చెప్పిన రఘురామ... ప్రొటోకాల్ ఉల్లంఘన ప్రభుత్వ పెద్దలకు తెలిసే జరిగిందో.. లేదో తనకు తెలియదని వ్యాఖ్యానించారు. దీంతో.. ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి!

# పార్లమెంట్ కాదు.. రాజ్యాంగమే సుప్రీం.. తేల్చిచెప్పిన చీఫ్ జస్టిస్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ప్రజాస్వామ్య పునాదులైన శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల్లో ఏది అత్యున్నతం..?? దేశ పార్లమెంటు, సుప్రీం కోర్టు.. వీటిలో ఏది అత్యున్నతం..? రాజ్యాంగం.. పార్లమెంటు.. వీటిలో ఏది ప్రధానం..? అనేకసార్లు ఇలాంటి చర్చ వచ్చింది. పలు సందర్భాల్లో తీవ్ర సంఘర్షణ కూడా తలెత్తింది. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవలే దేశ 52వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు జస్టిస్ బీఆర్ గవాయ్. మహారాష్ట్రలోని అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ గవాయ్... దేశంలో రాజ్యాంగమే అత్యుత్తమం అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలోని మూడు వ్యవస్థలు (శాసన, న్యాయ, కార్యనిర్వాహక) దీనికిందే పనిచేస్తాయని కుండబద్దలు కొట్టారు. బేసిక్ స్ట్రక్చర్ డాక్ట్రిన్ పై సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఉద్దేశించి మాట్లాడుతూ జస్టిస్ గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, రాజ్యాంగాన్ని సవరించేందుకు మాత్రమే పార్లమెంట్ కు అధికారాలు ఉనాయని... రాజ్యాంగం ప్రాథమిక రూపాన్ని మాత్రం మార్చేందుకు అధికారం లేదని స్పష్టం చేశారు. భారత ప్రజాస్వామ్యంలో శాసన (పార్లమెట్-అసెంబ్లీ), న్యాయ (కోర్టులు), కార్యనిర్వాహక (అధికార) వ్యవస్థలు ఉండగా.. నాలుగో వ్యవస్థగా మీడియాను పేర్కొంటారు. మొదటి మూడు వ్యవస్థలలో ఏది అత్యున్నతం అనే చర్చ తరచూ వస్తున్న సంగతిని జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే పార్లమెంటే అత్యున్నతం అని చాలామంది అంటారని.. రాజ్యాంగమే అత్యున్నతం అని, మిగతా మూడు విభాగాలు దానికిందనే పనిచేస్తాయని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. రాజ్యాంగం కిందనే విధులు నిర్వర్తిస్తున్నామని న్యాయమూర్తులు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని తేల్చిచెప్పారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం అని.. అధికారంతో పాటు బాధ్యతలు కూడా ఉన్నట్లు గుర్తించాలని స్పష్టం చేశారు. జడ్జిలు స్వతంత్రంగా ఆలోచించాలని.. తీర్పుల గురించి ప్రజలు ఏం అనుకుంటున్నారు? అనేది కాదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

# తెరపైకి 48వ వర్గం బ్లడ్ గ్రూప్... ఏమిటీ 'గ్వాడా నెగిటివ'?



**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా ఏ, బీ, ఏబీ, ఓ రకాల బ్లడ్ గ్రూప్స్ ని మాత్రమే ఎక్కువగా చూసే ప్రపంచంలో సరికొత్త రక్త వర్గం తెరపైకి వచ్చింది. సుమారు 15 సంవత్సరాల పరిశోధన తర్వాత ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు 48వ రక్త గ్రూపు వ్యవస్థను కనుగొన్నారు. ఈ కొత్త రక్త వర్గానికి "గ్వాడా నెగిటివ్" అని నామకరణం చేశారు. ఈ పేరు దాని మూలం యొక్క సారాంశాన్ని ప్రతిబింబిస్తుందని అంటున్నారు. అవును... శాస్తవేత్తలు తాజాగా ఒక కొత్త బ్లడ్ గ్రూప్ ను గుర్తించారు. ఫ్రెంచ్ మహిళలో ఈ కొత్త రకం రక్త వర్గాన్ని గుర్తించారు. ఆపరేషన్ కు ముందు చేసే రెగ్యులర్ పరీక్షల కోసం ఆమె రక్తనమూనాలను సేకరించి, పరీక్షించగా.. అందులో గతంలో ఎన్నడూ చూడని కొత్త వ్యత్యాసాలు కనిపించాయని అంటున్నారు. ఇదంతా తొలుత 2011లోనే ప్రారంభమైంది.
వివరాల్లోకి వెళ్తే... ఫ్రాన్స్ దేశంలోని గ్వాడెలోప్ ప్రాంతానికి చెందిన మహిళ, పారిస్ లో నివసిస్తుంది. 2011లో ఆపరేషన్ కోసం ఆస్పత్రికి వెళ్లిన 54 ఏళ్ల మహిళకు సాధారణ వైద్యపరీక్షల కోసం బ్లడ్ తీశారు. ఆ బ్లడ్ శాంపుల్స్ ని పరీక్షించిన వైద్యులకు అది అసాధారణంగా కనిపించింది. ఈ బ్లడ్ గ్రూప్, ఇతర సాధారణ బ్లడ్ గ్రూప్స్ తో ఏమాత్రం సరిపోలడం లేదు. అదేవిధంగా... ఈ రక్త వర్గంలోని యాంటీ బాడీస్ ఏ రక్తవర్గంలోనూ ఇప్పటి వరకు గుర్తించలేదు. దీంతో... ఈ అసాధారణ రక్త వర్గాన్ని గుర్తించిన వైద్యులు.. పరిశోధనల కోసం బ్లడ్ శాంపిల్స్ ను సేవ్ చేసి పెట్టారు. ఈ క్రమంలో ఎన్నో పరిశోధనలు చేసినప్పటికీ సుమారు 8 ఏళ్లపాటు ఎలాంటి ఫలితం రాలేదు. అయితే.. 2019లో మళ్లీ పరిశోధన ప్రారంభించారు. అప్పటికి అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో, దాని సహాయంతో పరిశోధన మళ్లీ ప్రారంభించారు. ఇందులో భాగంగా... హై క్వాలిటీ త్రోపుట్ డీ.ఎన్.ఏ సీక్వెన్సింగ్ సహాయంతో శాస్త్రవేత్తలు మళ్లీ రీసెర్చ్ మొదలుపెట్టారు. ఈ సమయంలో... ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న బ్లడ్ గ్రూప్స్ లో లేనటువంటి కొత్తరకం జెనిటిక్ మ్యుటేషన్ ను ఇందులో గుర్తించారు.
ఈ సందర్భంగా... సదరు మహిళ పేరెంట్స్ ఇద్దరూ అరుదైన జన్యువులను కలిగి ఉన్నారని.. ఆ అరుదైన జన్యువులే ఆమెకు వచ్చాయని.. ఈ క్రమంలో జెనిటిక్ మ్యూటేషన్ వల్ల అరుదైన రక్తవర్గం వచ్చిందని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఈ సందర్భంగా దీనికి 'గ్వాడా నెగిటివ్' అని నామకరణం చేశారు.
కాగా... ప్రపంచంలో ఇప్పటి వరకు మొత్తం 47 రకాల బ్లడ్ గ్రూప్స్ ను అధికారికంగా
గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా శాస్త్రవేత్తలు 48వ రకం బ్లడ్ గ్రూప్ ను గుర్తించారు. ఈ మేరకు ఫ్రెంచ్ బ్లడ్ ఎస్టాబ్లిష్ మెంట్.. 48వ రక్తవర్గాన్ని గురించినట్లు అధికారికంగా ప్రకటించింది. ఇటీవలే ఈ బ్లడ్ గ్రూప్ కు ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్ఫ్యూజన్ (ఐ.ఎస్.బీ.టీ) గుర్తింపు లభించింది.

# టూవీలర్లకు టోల్ ఫీజు ప్రచారం: కేంద్ర మంత్రి గడ్కరీ సంచలన ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** జులై 15 నుండి నేషనల్ హైవేలపై టూవీలర్లకు కూడా టోల్ ఫీజు వసూలు చేస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో, కొన్ని వార్తాపత్రికలలో వస్తున్న వార్తలను కేంద్ర రహదారులు.. రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గట్టిగా ఖండించారు. ఈ ప్రచారం అవాస్తవం అని, ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన స్పష్టం చేశారు.

**ప్రచారంపై వివరణ**

గత కొన్ని రోజులుగా నేషనల్ హైవేలపై ద్విచక్ర వాహనాలకు కూడా టోల్ వసూలు చేస్తారన్న వార్తలు విపరీతంగా ప్రచారంలో ఉన్నాయి. ఈ వార్తలు ప్రజలలో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులలో తీవ్రమైన ఆందోళనను రేకెత్తించాయి. ఇంధన ధరలు ఇప్పటికే భారంగా మారిన నేపథ్యంలో టోల్ ఫీజు భారం మరింత పెరగనుందని చాలామంది ఆందోళన చెందారు. అయితే, ఈ వార్తలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తక్షణమే స్పందించి, వాటిని పూర్తిగా ఖండించారు.

**గడ్కరీ ప్రకటన**

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మీడియాతో మాట్లాడుతూ "టూవీలర్లకు టోల్ ఫీజు వసూలు చేయాలని ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ద్విచక్ర వాహనాలకు టోల్ ఫీజు నుండి పూర్తి మినహాయింపు కొనసాగుతుంది" అని స్పష్టంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో ద్విచక్ర వాహనదారులకు పెద్ద ఊరట లభించింది. టోల్ వసూలుకు సంబంధించి వస్తున్న వార్తలు కేవలం వదంతులు మాత్రమేనని, వాటిని నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు.

**పూర్వపు విధానం కొనసాగింపు**

భారతదేశంలో ద్విచక్ర వాహనాలకు నేషనల్ హైవేలపై టోల్ ఫీజు నుంచి ఎప్పుడూ మినహాయింపు ఉంది. ఈ మినహాయింపు కొనసాగుతుందని గడ్కరీ మరోసారి ధ్రువీకరించారు. హైవేలపై ద్విచక్ర వాహనాలకు ప్రత్యేకంగా లేన్లు ఉండకపోవడం, వాటి వేగం , భద్రత దృష్ట్యా ఈ మినహాయింపును అందిస్తున్నారు. చిన్న తరహా వాహనాలు.. సామాన్య ప్రజల ప్రయాణ సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ విధానం అమలులో ఉంది.

**ప్రచారాల పట్ల జాగ్రత్త**

సామాజిక మాధ్యమాలలో తప్పుడు సమాచారం , వదంతులు చాలా వేగంగా వ్యాపిస్తున్నాయి. ఇటువంటి ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నితిన్ గడ్కరీ పరోక్షంగా సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన అధికారిక సమాచారం కోసం విశ్వసనీయ వర్గాలను మాత్రమే అనుసరించాలని ఆయన పరోక్షంగా తెలిపారు. తప్పుడు వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని, ఏదైనా కొత్త విధానం అమలైనట్లయితే, ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తుందని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టమైన ప్రకటనతో టూవీలర్లకు టోల్ ఫీజు వసూలు అంశంపై నెలకొన్న గందరగోళం తొలగిపోయింది. ద్విచక్ర వాహనదారులకు టోల్ భారం ఉండదని, ప్రస్తుత మినహాయింపు కొనసాగుతుందని మరోసారి స్పష్టమైంది. భవిష్యత్తులో ఇటువంటి అవాస్తవ ప్రచారాలపై ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది.

# వలసదారులపై మరింత కఠిన చర్యలు.. ట్రంప్ నెక్స్ట్ నిర్ణయం ఏమిటంటే..?




**హైదరాబాద్ పెన్ పవర్:** పన్నెండు రోజుల పాటు పశ్చిమాసియాను రగిలించేసిన ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య జరిగిన భీకర యుద్ధం ముగిసిన సంగతి తెలిసిందే. ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో వాతావారణం చల్లబడింది. దీంతో యుద్ధం ముగిసిందంటూ డొనాల్డ్ ట్రంప్ పలు పోస్టులు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి స్పందించిన ఆయన.. మళ్లీ యుద్ధం రావొచ్చేమో అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.
అవును... ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య యుద్ధం ముగిసి రెండు రోజులు కావొస్తుంది. పశ్చిమాసియా ఇప్పుడిప్పుడే కాస్త ప్రశాంత వాతావరణంలోకి అడుగుపెడుతోంది. ఈ సమయంలో ఇజ్రాయెల్, ఇరాన్ తో తాను చర్చలు జరిపానని.. అవి రెండూ ప్రస్తుతానికి అలిసిపోయాయని.. అయితే మళ్లీ యుద్ధ బహుశా ఏదో ఒకరోజు రావొచ్చని.. త్వరలోనే యుద్ధం మళ్లీ ప్రారంభం కావొచ్చని ట్రంప్ అన్నారు.
దీంతో... ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇజ్రాయెల్ అయితే ట్రంప్ కు చెప్పకుండా ఏ పనీ చేయకపోవచ్చు. అయితే.. ఇరాన్ ఎప్పుడు ఏమి చేస్తుందో ట్రంప్ గిల్లుడును బట్టి, ఆంక్షలను బట్టి ఉంటుందని.. ఆ ఉద్దేశ్యంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసి ఉండొచ్చని అంటున్నారు పరిశీలకులు. పైగా.. ఇరాన్ తో చర్చలవేళ ఇది ఓ బెదిరింపు హింట్ అయ్యికూడా ఉండొచ్చని చెబుతున్నారు.
ఈ సందర్భంగా ఇరాన్ తో అణు చర్చల అంశాన్ని మరోసారి ప్రస్తావించారు ట్రంప్. ఇందులో భాగంగా... వచ్చే వారం టెహ్రాన్ తో అణు చర్చలు జరుపుతామని.. అణ్వాయుధాలు తయారుచేయాలన్న ఆశయాన్ని వదిలేసేలా ఇరాన్ తో ఒప్పందం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. ఇదే సమయంలో.. ఇరాన్ పై అమెరికా దాడుల వల్లే పశ్చిమాసియాలో యుద్ధానికి త్వరగా ముగింపు పడిందని ఆయన అన్నారు. పైగా... తన నిర్ణయంతో అందరికీ విజయం లభించిందని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం. మరోవైపు.. ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించే అవకాశాలున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇందులో భాగంగా... ప్రస్తుతం ఇరాన్ పునర్నిర్మాణానికి ఆర్థిక వనరులు కావాలని.. ఈ సమయంలో ఆ దేశం కోలుకునేలా మద్దతు ఇవ్వడం కోసం కొన్ని ఆంక్షలను సడలించే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ట్రంప్ వెల్లడించారు.

**ఇరాన్ నష్టంపై సీఐఏ క్లారిటీ!:**

ఇరాన్ లోని అణుకేంద్రాలపై ఇజ్రాయెల్ దాడివల్ల పెద్ద నష్టం ఏమీ జరగలేదని ఒకరంటే.. రెండు మూడు నెలల్లో ఇరాన్ మళ్లీ పని మొదలుపెడుతుందని మరొకరు అన్నారు. అయితే... ఇప్పట్లో ఇరాన్ తేరుకోలేదని అమెరికా, ఇజ్రాయెల్ లు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీ.ఐ.ఏ) ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది.
ఇందులో భాగంగా... ఇటీవల జరిగిన దాడుల్లో ఇరాన్ అణు కార్యక్రమం తీవ్రంగా దెబ్బతిన్నట్లు నమ్మకమైన ఇంటెలిజెన్స్ విభాగం ఒకటి వెల్లడించిందని.. మరిన్ని వివరాలను తాము సేకరించి పాలకులకు అందిస్తామని.. అమెరికా ప్రజలకూ తెలియజేస్తామని.. జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశం కావడంతో పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తామని సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్ క్లిఫ్ ప్రెస్ నోట్లో పేర్కొన్నారు.

**మరోసారి క్లారిటీ ఇచ్చిన ట్రంప్:**

ఇదే విషయంపై ట్రంప్ నాటో సదస్సు వేదికగా మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఇందులో భాగంగా.. ఇజ్రాయెల్ మనుషులు అక్కడికి వెళ్లి పరిశీలించి పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిపారని.. ఇప్పుడు ఇజ్రాయెల్ దానిపై ఓ నివేదిక తయారుచేస్తోందని.. పూర్తిగా ధ్వంసమైందని వారు చెప్పడంతోపాటు.. తాను కూడా నమ్ముతున్నానని.. అక్కడ (ఇరాన్ అణు కేంద్రాల్లో) ఏదీ మిగిలే అవకాశం లేదని ట్రంప్ పేర్కొన్నారు.

# టెస్ట్ క్రికెట్‌లోనూ స్టాప్ క్లాక్.. ఐసీసీ ప్రకటించిన ఐదు కొత్త రూల్స్ ఇవే



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మెన్స్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఐదు కొత్త రూల్స్ తీసుకొని వచ్చింది. గురువారం (జూన్ 26) ప్రకటించిన ఈ రూల్స్ లో టెస్ట్ క్రికెట్ పై ఫోకస్ చేస్తూ రూల్స్ ప్రకటించింది. గత వారం కంకషన్ సబ్‌స్టిట్యూట్ లో గందరగోళాన్ని తొలగించగా.. వన్డే ఫార్మాట్ లో బ్యాట్, బంతికి మధ్య కాంటెస్ట్ రసవత్తరంగా మార్చాలని కొత్త బంతి పై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. తాజాగా టెస్ట్ క్రికెట్ లో స్టాప్ క్లాక్ రూల్.. డీఆర్‌ఎస్ విధానంపై మార్పులు చేస్తూ కీలక రూల్స్ ప్రకటించింది. ఈ రూల్స్ మూడు ఫార్మాట్ లకు వర్తిస్తాయి. ఐసీసీ కొత్తగా ప్రవేశ పెట్టిన రూల్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.

**టెస్ట్ క్రికెట్ లో స్టాప్ క్లాక్:**

స్టాప్ క్లాక్ రూల్ ఇప్పటివరకు వన్డే, టీ20 ఫార్మాట్ లో మాత్రమే ఉంది. ఈ రూల్ ను ఐసీసీ టెస్టుల్లోనూ చేర్చింది. టెస్ట్ మ్యాచ్‌లలో స్లో ఓవర్ రేట్ల సమస్యను పరిష్కరించడానికి ఐసీసీ స్టాప్ క్లాక్‌ను ప్రవేశపెట్టింది. ఈ రూల్ ప్రకారం ఫీల్డింగ్ చేస్తున్న జట్టు మునుపటి ఓవర్ ముగిసిన 60 సెకన్లలోపు కొత్త ఓవర్‌ను ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆలస్యమైతే అంపైర్లు వార్నింగ్ ఇస్తారు. రెండు సార్లు కంటే అంపైర్ ఎక్కువసారి వార్నింగ్ ఇచ్చినట్లయితే బ్యాటింగ్ చేసే జట్టుకు 5 పరుగుల పెనాల్టీ ఇస్తారు. ప్రతి 80 ఓవర్లకు గడియారం రీసెట్ అవుతుంది. ఈ మార్పు ఇప్పటికే ప్రస్తుత వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ సైకిల్‌లో ఉపయోగిస్తున్నారు.

**లాలాజల నియమం సడలించబడింది:**

బంతిపై లాలాజలం వాడకంపై నిషేధం తొలగించిన సంగతి తెలిసిందే. అయితే దీన్ని అడ్వాంటేజ్ గా తీసుకొని ఫీల్డింఫ్ చేస్తున్న జట్టు బంతి స్వరూపాన్ని మార్చి కొత్త బంతిని తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇకపై అలా జరగడానికి వీలు లేదు. అంపైర్లు బంతిని స్థితిని గమనించి.. బంతి పరిస్థితి గణనీయంగా మారిందని అంపైర్లు నిర్ధారించినట్లయితే బంతిని మారుస్తారు. లాలాజలాన్ని బలవంతంగా బంతిపై రుద్దడానికి వీలు లేదు. ఉద్దేశ్యపూర్వకంగా ఎవరైనా అలా చేస్తే బ్యాటింగ్ జట్టుకు 5 పరుగుల పెనాల్టీ విధిస్తారు.

**DRS విధానంలో కొత్త మార్పు:**

ఈ రూల్ ప్రకారం (ఉదాహరణకు) ఫీల్డింగ్ చేస్తున్న జట్టు క్యాచ్ కోసం అప్పీల్ చేస్తుంది. ఈ సమయంలో అంపైర్ ఔటిస్తే బ్యాటింగ్ చేసే జట్టు క్యాచ్ అప్పీల్ కోసం రివ్యూ కోరుతుంది. ఈ సమయంలో థర్డ్ అంపైర్ మొదట అల్ట్రాఎడ్జ్ చెక్ చేస్తారు. ఒకవేళ బంతి బ్యాట్ కు తగలేకపోతే ఎల్బీడబ్ల్యూ కోసం అంపైర్ చెక్ చేస్తారు. ఎల్బీడబ్ల్యూలో ఔట్ అని తేలినా లేకపోతే అంపైర్స్ కాల్ వచ్చినా ఔట్ గానే పరిగణిస్తారు.

**నో బాల్ లో క్లీన్ క్యాచ్ పడితే పరుగులు ఉండవు:**

సవరించిన రూల్ ప్రకారం నో బాల్ వేసినప్పుడు క్యాచ్ పడితే దాన్ని నాటౌట్ గా పరిగణిస్తారని మనకు తెలిసిందే. అయితే క్యాచ్ పట్టినప్పుడు అది క్లీన్ క్యాఛా.. కాదా అని పరిశీలిస్తారు. ఒకవేళ క్లీన్ క్యాచ్ అయితే అప్పటివరకు తిరిగిన పరుగులు బ్యాటింగ్ జట్టుకు జత చేయరు. కేవలం నో-బాల్ పరుగు మాత్రమే బ్యాటింగ్ జట్టు స్కోరుకు జోడించబడుతుంది. ఒకవేళ క్లీన్ క్యాచ్ కాకపోతే బ్యాటర్లు పూర్తి చేసిన పరుగులను జట్టు స్కోర్ లో జత చేస్తారు. అంతేకాదు క్యాచ్ సరిగా పట్టకుండా ఔట్ అని అప్పీల్ చేస్తే.. థర్డ్ అంపైర్ చెక్ చేశాక అది క్లీన్ క్యాచ్ కాదని నాటౌట్ గా తెలితే నో బాల్ గా ప్రకటిస్తారు.

**షార్ట్ రన్ తీస్తే భారీ మూల్యం:**

బ్యాటర్లు పరుగు పూర్తి చేసేటప్పుడు కొన్ని సందర్భాల్లో బ్యాట్ ను పూర్తిగా క్రీజ్ లో పెట్టరు. దీనినే షార్ట్ రన్ అంటారు. గతంలో ఇలా చేస్తే అంపైర్లు చెక్ చేసి ఆ రన్ ఉండదని అంపైర్లు బ్యాటర్లకు వార్నింగ్ ఇస్తారు. అయితే కొత్తగా సవరించిన రూల్స్ ప్రకారం బ్యాటర్ పరుగు పూర్తి చేసి ఇంకో పరుగు తీసే క్రమంలో క్రీజ్ లో బ్యాట్ పూర్తిగా పెట్టరో ఆ జట్టుకు 5 రన్స్ పెనాల్టీ విధించబడుతుంది. అంతేకాదు ఫీల్డింగ్ జట్టు తర్వాత బంతికి ఎవరు స్ట్రైక్ తీసుకోవాలో ఎంచుకోవచ్చు.

# ఆర్చర్ ఇన్.. బుమ్రా ఔట్: రెండో టెస్టుకు ఇంగ్లాండ్, ఇండియా జట్లలో కీలక మార్పులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎడ్జ్‌బాస్టన్ వేదికగా బుధవారం (జూలై 2) భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండో టెస్టు జరగనుంది. తొలి టెస్ట్ తర్వాత వారం గ్యాప్ ఇరు జట్లు రెండో టెస్ట్ ఆడడానికి సిద్ధమవుతున్నాయి. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో టీమిండియాపై ఇంగ్లాండ్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్టులోనూ గెలిచి భారత్ పై స్పష్టమైన ఆధిక్యం సంపాదించాలని ఇంగ్లాండ్ చూస్తుంటే.. తొలి టెస్టులో ఎదురైన ఓటమికి టీమిండియా ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోంది. ఈ టెస్టులో ఇండియా, ఇంగ్లాండ్ జట్లు ఒక కీలక మార్పుతో బరిలోకి దిగడం దాదాపుగా ఖాయంగా మారింది.

**రెండో టెస్టుకు బుమ్రా దూరం:**

టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా రెండో టెస్ట్ ఆడే అవకాశాలు కనిపించడం లేదు. వర్క్ లోడ్ కారణంగా సిరీస్ కు ముందే బుమ్రా 3 టెస్టులు మాత్రమే ఆడతానని చెప్పాడు. తొలి టెస్ట్ ముగిసిన తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ సైతం బుమ్రా మూడు టెస్టులు ఆడతాడని కన్ఫర్మ్ చేశాడు. ఇప్పటికే బుమ్రా ఒక టెస్ట్ ఆడాడు. మిగిలిన నాలుగు టెస్టుల్లో రెండు మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఒకవేళ బుమ్రా రెండో టెస్ట్ కూడా ఆడితే అప్పుడు చివరి మూడు టెస్టుల్లో ఒకటే టెస్ట్ ఆడాలి. దీంతో ఈ గుజరాత్ పేసర్ కు రెండో టెస్టుకు రెస్ట్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టు జట్టు యాజమాన్యం భావిస్తోందట.

లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్ లో బుమ్రా 5 వికెట్లు తీసి సత్తా చాటాడు. రెండో రోజు ఆటలో భాగంగా మూడు కీలక వికెట్లు తీసుకోగా.. మూడో రోజు మరో రెండు వికెట్లు పడగొట్టాడు. దీంతో టెస్ట్ కెరీర్ లో 14 వ సారి 5 వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఓవరాల్ గా బుమ్రా తొలి ఇన్నింగ్స్ లో 24.4 ఓవర్లు బౌలింగ్ చేసి 83 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు.

**నాలుగేళ్ళ తర్వాత ఆర్చర్ రీ ఎంట్రీ..**

ఇంగ్లాండ్ కు రెండో టెస్టుకు ముందు గుడ్ న్యూస్ అందింది. స్టార్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ రెండో టెస్ట్ కోసం ఇంగ్లాండ్ స్క్వాడ్ లో ఎంపికయ్యాడు. దీంతో నాలుగేళ్ల తర్వాత ఆర్చర్ టెస్ట్ క్రికెట్ లోకి అడుగుపెట్టబోతున్నాడు. బొటన వేలి గాయం నుంచి కోలుకొని ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో మ్యాచ్ ఆడాడు. చెస్టర్-లె-స్ట్రీట్‌లో జరిగిన కౌంటీ ఛాంపియన్‌షిప్ లో భాగంగా దర్హామ్‌తో జరిగిన మ్యాచ్‌లో ససెక్స్ తరపున ఈ స్పీడ్‌స్టర్ 14 ఓవర్లు బౌలింగ్ చేశాడు. మే 2021 తర్వాత ఆర్చర్ తన తొలి ఫస్ట్-క్లాస్ మ్యాచ్ ఆడడం విశేషం. ఈ మ్యాచ్ లో ఇబ్బందిపడకుండా బౌలింగ్ చేసిన ఈ ఇంగ్లాండ్ పేసర్.. ఒక వికెట్ కూడా తీసుకున్నాడు. ఈ స్పెల్ తో తాను రెండో టెస్టుకు రెడీ అని సంకేతాలు ఇచ్చాడు.

ఆర్చర్ తన చివరి టెస్ట్ మ్యాచ్ ను 2021 ఫిబ్రవరిలో ఆడాడు. ఆ తర్వాత మోచేయికి శస్త్రచికిత్స చేపించుకొని సుదీర్ఘ ఫార్మాట్ కు దూరమయ్యాడు. ఈ క్రమంలో 2023 లో జరిగిన యాషెస్ తో భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్ కప్ కు దూరమయ్యాడు. జూలై 2న ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌తో ఇంగ్లాండ్ రెండో టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ లో ఆర్చర్ బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ జట్టులో అనుభవం లేని ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు. ఆర్చర్ జట్టులోకి వస్తే ఇంగ్లాండ్ బౌలింగ్ సమస్యలు తీరినట్టే.

# టెస్ట్ క్రికెట్ చరిత్రలో తొలిసారి.. మ్యాచ్ మధ్యలోనే గ్రౌండ్ వదిలి వెళ్లిపోయిన అంపైర్




**హైదరాబాద్ పెన్ పవర్:** కొలంబో వేదికగా సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ లో శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య బుధవారం (జూన్ 25) రెండో టెస్ట్ ప్రారంభమైంది. ఈ టెస్టులో తొలి రోజు శ్రీలంక బౌలర్లు ఆధిపత్యం చూపించగా.. రెండో రోజు శ్రీలంక బ్యాటర్లు బంగ్లా బౌలర్ల భరతం పట్టారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 2 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసింది. క్రీజ్ లో పాతుం నిస్సాంక (146), ప్రబాత్ జయసూర్య (5) ఉన్నారు. ప్రస్తుతం శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 43 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ తొలి రోజు ఆటలో భాగంగా ఒక అనూహ్య సంఘటన జరిగింది. తొలి రోజు ఆటలో భాగంగా ఆన్ ఫీల్డ్ అంపైర్ గ్రౌండ్ వదిలి మ్యాచ్ మధ్యలోనే వెళ్ళిపోయాడు. ఆన్-ఫీల్డ్ అంపైర్ అలెక్స్ వార్ఫ్ స్థానంలో నాల్గవ అంపైర్ ప్రగీత్ రాంబుక్వెల్లా గ్రౌండ్ లోకి వచ్చాడు. అయితే దీనికి కారణం లేకపోలేదు. అలెక్స్ వార్ఫ్ ఆనారోగ్యంతో ఉండడంతో అతను గ్రౌండ్ లో ఉండలేకపోయాడు. 148 ఏళ్ళ టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక అంపైర్ ఆట మధ్యలోనే వెళ్లిపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంది. అనారోగ్యంతో ఉన్న అంపైర్ త్వరగా కోలుకుని మైదానంలోకి తిరిగి రావాలని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బంగ్లాదేశ్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఇన్నింగ్స్ 65 ఓవర్లో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ లో 247 పరుగులకు ఆలౌట్ అయింది. షాద్మాన్ ఇస్లామ్ (46), ముష్ఫికర్ రహీమ్ (35), లిటన్ దాస్ (34), మెహిదీ హసన్ మిరాజ్ (31) మెరుగ్గా ఆడటంతో తొలి రోజ ఆట ముగిసే టైమ్‌కు బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 71 ఓవర్లలో 220/8 స్కోరు చేసింది. రెండో రోజు మరో 27 పరుగులు జోడించి చివరి రెండు వికెట్లు కోల్పోయింది. అనంతరం మొదట ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 2 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసింది. పాతుం నిస్సాంక ఈ సిరీస్ లో వరుసగా రెండో సెంచరీ చేసి సత్తా చాటగా.. చండీమల్ తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు.



ఆకాంక్ష శర్మ స్లాగా గజల్ గుప్త కోచర్

# ఇంకా సైలెంట్ మోడ్‌లోనే నేచురల్ స్టార్?



నేచురల్ స్టార్ నాని ఇటీవలే %-%హిట్:ది థర్డ్ కేస్%-%తో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. శైలేష్ కొలను తెరకెక్కించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టి నాని కెరీర్‌లో మరో రూ.100 కోట్ల మూవీగా నిలిచింది. మే 1న ఐదు భాషల్లో విడుదలైన %-%హిట్ 3%-% ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. అక్కడ కూడా ఐదు భాషల్లో టాప్‌లో ట్రెండ్ కావడం తెలిసిందే. ఇదిలా ఉంటే ఈ సినిమా విడుదలై..ఓటీటీలోకి వచ్చేసినా నాని మాత్రం ఇప్పటికీ సైలెంట్ మోడ్‌లోనే ఉన్నాడు.

ఇది ఫ్యాన్స్‌ని కలవరానికి గురి చేస్తోంది. %-%హిట్ 3%-%తో బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన నాని అదే ఊపులో తదుపరి ప్రాజెక్ట్‌ని పట్టాలెక్కిస్తాడు అనుకుంటే సైలెంట్ మోడ్‌లోనే ఉండటం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ మూవీ తరువాత %-%దసరా%-% ఫేమ్ శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో నాని %-%ది ప్యారడైజ్%-% పేరుతో ఓ భారీ పాన్ ఇండయా సినిమాకు శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి గ్లింప్స్‌ని మూడు నెలల క్రితమే అంటే మార్చి 3న విడుదల చేశారు.

దీని కోసం ఏకంగా టీమ్ కోటీ ఖర్చు చేసినట్టుగా వార్తలు వినిపించాయి. సికింద్రాబాద్ లోని పారడైజ్ ఏరియాలో జరిగిన ఓ యాదార్ధ సంఘటన ఆధారంగా తెలంగాణకు చెందిన ఓ రచయిత రాసిన బుక్ ఆధారంగా ఈ సినిమాని తెరపైకి తీసుకురాబోతున్నారు. ఓ వేశ్య కొడుకు కథగా, తల్లి పంతం కోసం ఓ కొడుకు చేసిన సమరం నేపథ్యంలో ఈ సినిమాని శ్రీకాంత్ ఓదెల సెట్స్ పైకి తీసుకెళ్లబోతున్నాడు. గత కొంత కాలంగా దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది.%-%దసరా%-%ని నిర్మించిన సుధాకర్ చెరుకూరి నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ రా అండ్ రస్టిక్ కంటెంట్‌తో రూపొందబోతోందని ఇప్పటికే గ్లింప్స్‌లోని సన్నివేశాలు, డైలాగ్‌లతో స్పష్టమైంది. గ్లింప్స్ కారణంగా ఈ సినిమాపై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ప్రీ రిలీజ్ బిజినెస్‌తో పాటు నాన్ థియేట్రికల్ బిజినెస్ పరంగానూ భారీ డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఇంత వరకు దీని షూటింగ్‌కు సంబంధించిన అప్ డేట్ లేదేంటనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా నాని సైలెంట్ మోడ్‌ని వీడి ది ప్యారడైజ్ - షూటింగ్ అప్ డేట్‌ని ఇవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి నాని వారి మాటలు వింటున్నాడా? షూటింగ్ అప్ డేట్‌నిస్తాడా? అన్నది వేచి చూడాల్సిందే.



ఇటీవలి ఫోటోలలో భూమి పెడ్నేకర్ మెరిసింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com